లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

ప్రజలే ప్రభువులు

# జనబలం

సెప్టెంబర్ 2019 రూ.10/-








## భారత్‌లో మార్పు కోసం

అమెరికాలో జేపీ ఎన్నారై సమావేశాలు






## ఎన్నికల మేనిఫెస్టోలు.. భారత రాజ్యాంగం




## అందరికీ స్వాతంత్ర్య ఫలాలు భవిష్యత్ కార్యాచరణ







# సర్వే పటాలు అభివృద్ధి మార్గాలు

మౌలిక వసతుల ఏర్పాటుకు సర్వే మ్యాప్ (పటం) ఎంతో ముఖ్యమైన ప్రాథమిక ఉపకరణం. కేవలం భౌతిక కొలతలు, భౌగోళిక సమగ్రతల్ని అందించటానికే కాకుండా.. అభివృద్ధి కార్యక్రమాలన్నింటికీ ఇది వెన్నెముకలా వ్యవహరిస్తుంది. మారుతున్న పరిస్థితుల్లో సర్వే వ్యవస్థ పనితీరును తెలుసుకునేందుకు మాజీ సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా డా॥ సుబ్బారావుతో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) పరిశోధక బృందం హైదరాబాద్ బేగంపేటలోని కార్యాలయంలో సమావేశమైంది. ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటిష్ ప్రభుత్వం నుంచి స్వతంత్ర భారత ప్రభుత్వం వరకూ సర్వే ఆఫ్ ఇండియా సేవల తీరును ఆయన వివరించారు. మ్యాపింగ్‌లో చోటుచేసుకుంటున్న కొత్త ధోరణుల్ని, ప్రజలకు మెరుగైన సేవల్ని అందించటంలో వాటి ప్రాధాన్యతను తెలియజేశారు. అంతర్జాతీయ, రాష్ట్ర సరిహద్దులను సర్వే చేయటంలో ఇమిడివుండే అంశాలను వివరించారు. పటాల్లో ఉండే అసంపూర్ణతలు, సర్వే ఆఫ్ ఇండియా ఎదుర్కొంటున్న రోజువారీ సవాళ్ల గురించి ప్రస్తావించారు. నగరాల ప్రణాళిక, పట్టణీకరణ, సర్వే, మ్యాపింగ్‌లకు ట్రాఫిక్ వల్ల అవరోధాలను చర్చించారు. నగరాల ప్రణాళికలో పటాల తయారీ (కార్టోగ్రఫీ)ని నిర్లక్ష్యం చేయటం వల్ల ఎదురయ్యే పర్యవసానాలను ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ సందర్భంగా వివరించారు. ట్రాఫిక్ అంశాలకు సంబంధించి నెదర్లాండ్స్ ట్రాఫిక్ పద్ధతిని ఉదహరించారు. నగర ప్రణాళికలో 3-ఇల అవసరం ఉందని సుబ్బారావు అన్నారు. ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉండాలన్నారు. చట్టాలు సరిగా అమలుకాకుంటే ఎక్కువమంది పౌరులు బాధ్యతలు ఎగ్గొట్టే అవకాశాలు ఎక్కువని జేపీ అన్నారు. జరిగిన నష్టాన్ని అధిగమించి ఇప్పటికైనా .. జనజీవితాల్ని దుర్భరం చేస్తున్న అడ్డగోలు విస్తరణ ధోరణుల నుంచి ఆనందదాయక క్రమబద్ధ అభివృద్ధికి భారతీయ పట్టణ ప్రాంతాలు మళ్లటానికి పరిష్కారాలపై సమావేశం లోతుగా చర్చించింది.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుట 22 సంచిక 09
సెప్టెంబర్ 2019

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి
సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 అమెరికాలో జేపీ పిలుపుకి స్పందిస్తున్నాం..

12 ఎన్నికల మేనిఫెస్టోలు భారత రాజ్యాంగం

21 చివరికి జీవనాధారమే లేకుండా పోయింది!

23 గాడి తప్పామని ఒప్పుకుంటూనే..

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com




మనం తొలగించిన అధికారు
లంతా కలిసి కన్సల్టెన్సీ
పెట్టుకున్నారు సార్... డిపార్టు
మెంటులో ఏయే అధికారి
ఎంతెంత తిని పనిచేస్తాడనేది
క్లైంట్లకు చెబుతున్నారు.

(కార్టూన్: ఈనాడు)

---


## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*




05

జనబలం
సెప్టెంబర్ 2019

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

సంపాదకీయం

# కొండను తవ్వి ఎలుకను పట్టిన అస్సాం ఎన్.ఆర్.సి

అస్సాం రాష్ట్రానికి సంబంధించిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ తుది జాబితా ఆగస్టు 31వ తేదీన వెలువడింది. అస్సాంలో నివసిస్తున్న 68.27 లక్షల కుటుంబాలకు చెందిన 3.29కోట్ల మంది తాము భారతీయులమేనని గుర్తింపు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. తమ దరఖాస్తుకు మద్దతుగా 6.5కోట్ల ధృవ పత్రాలను సమర్పించారు. 52వేల మంది ప్రభుత్వోద్యోగులు, 9వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు, మరో 6వేల మంది ఒప్పంద సేవల సిబ్బంది ప్రపంచంలోనే అతిపెద్ద పౌరసత్వ గుర్తింపు ప్రక్రియలో పాలుపంచుకున్నారు. రాష్ట్రంలో దాదాపు 2500 ఎన్ఆర్‌సీ సేవా కేంద్రాలు మొత్తం పనిని నిర్వహించడంలో పౌరులకు తోడ్పడ్డాయి. సుప్రీంకోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్ఆర్‌సి సంస్థ దాదాపు 1500 కోట్ల రూపాయల మొత్తాన్ని వ్యయం చేసి ప్రక్రియను ఒక కొలిక్కి తెచ్చింది. 3కోట్ల 10లక్షల మందిని భారతీయ పౌరులుగా గుర్తిస్తూ జాబితాను ప్రకటించింది. సుమారు 19 లక్షల మంది తమ పౌరసత్వ గుర్తింపునకు అవసరమైన పత్రాలను సమర్పించ లేకపోయారని ఎన్ఆర్‌సీ ప్రకటించింది. అంతమాత్రం చేత వీరంతా అక్రమంగా విదేశాల నుండి వచ్చిన వారేనని భావించడం లేదని స్పష్టం చేసింది. వీరంతా తమ గుర్తింపును ధృవీకరించుకునేందుకు 120 రోజులలో అస్సాంలో ఏర్పాటు చేసిన ఫారిన్ ట్రిబ్యునల్‌లో తమకు న్యాయం జరగలేదని భావిస్తే హైకోర్టుకు, ఆ తర్వాత సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తికావడానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేం!

తగిన పత్రాలు చూపలేక భారతీయ పౌరసత్వాన్ని నిరూపించుకోలేని 19లక్షల మందిలో నాలుగైదు లక్షల మంది జీవించిలేరని, అందువల్ల వారి సంఖ్యను ఆ జాబితానుండి తొలగించవచ్చని ఈ ప్రక్రియను పరిశీలించిన నిపుణులు పేర్కొన్నారు. ఇక మిగిలిన వారిలో చాలా మంది భారతీయ పౌరులేనని, వారివద్ద తగిన పత్రాలు లేకపోవడం వల్ల ఎన్ఆర్‌సీలో వారి పేర్లు చోటు చేసుకోలేదని అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి సర్బానంద్ సోనోవాల్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హేమంత్ బిశ్వకుమార్ శర్మ పేర్కొన్నారు. ఎన్ఆర్‌సీలో లేనంత మాత్రాన వారు భారతీయులు కారని చెప్పడం తగదని వారంటున్నారు. అలాగే కొంతమంది తప్పుడు పత్రాలతో ఎన్ఆర్‌సీలో చేరిపోయారని కూడా వారు ఆరోపిస్తున్నారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రక్రియను సాక్షాత్తు బీజేపీ నేతలే తప్పుపట్టడం చూస్తుంటే సమస్య పరిష్కారం పట్ల వారికి గల చిత్తశుద్ధిని సందేహించాల్సి వస్తుంది. అస్సాంలో విదేశీయుల సమస్యను ఒక తీవ్ర సమస్యగా చిత్రీకరిస్తూ గత 4 దశాబ్దాలుగా సాగిన ఉద్యమం, దాని చుట్టూ అల్లిన కట్టుకథలు అవాస్తవాలని ఎన్ఆర్‌సీ ప్రక్రియ తేటతెల్లం చేసింది. అక్రమంగా వలస వచ్చిన వారితో అస్సాం నిండిపోతోందని, అస్సాం భూములను, ఉద్యోగాలను, ఉపాధిని వారు కొల్లగొడుతున్నారని, అస్సామియా సంస్కృతిని అక్రమ వలస దారులు ధ్వంసం చేస్తున్నారని దశాబ్దాల తరబడి ఒక కథనాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. దాంతో అస్సామి సమాజంలో తీవ్ర విభజన వచ్చింది. తోటి పౌరుల గుర్తింపును అనుమానించే దుస్థితి ఏర్పడింది. తొలుత విదేశీ వలస వాదులకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం తర్వాత బెంగాలీ ముస్లిములకు వ్యతిరేకంగా మారింది.

నిజానికి అస్సాం ప్రాంతంలోకి 1826 నుండి బ్రిటిష్ వారి ప్రోత్సాహంలో బ్రిటిష్ ఇండియా భూభాగాల నుండి వలసలు జరిగిన మాట నిజమే. అప్పటికి సరిహద్దుల విభజన లేని ఒకేదేశంగా ఉండటంతో వలసలు సాధ్యమయ్యాయి. 1947 ఆగస్టు 15 నాటి దేశ విభజన కారణంగా అటు నుండి ఇటు.. ఇటు నుండి అటు వలసలు సాగాయి. ఆ తర్వాత బంగ్లాదేశ్ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని జరిగిన కల్లోల పరిస్థితుల్లో మరో దఫా వలసలు జరిగాయి. అందులో మత ప్రసక్తి లేదు. అవన్నీ.. బతుకుతెరువు కోసం భద్రత కోసం జరిగిన సహజమైన వలసలు. అయితే విదేశీయుల సంఖ్య, ముఖ్యంగా ముస్లిముల సంఖ్య పెరిగిపోతోందన్న ఆందోళన ఏర్పడిన నేపథ్యంలో 1979లో అస్సాం విద్యార్థి ఉద్యమం మొదలైంది. ఆరేళ్ల హింసాత్మక ఉద్యమంలో 860 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఉద్యమ నేపథ్యంలో నెల్లీలో జరిగిన మారణకాండలో 2,191 మంది ముస్లిములను ఊచకోత కోశారు. 1985 అస్సాం ఒప్పందం ప్రకారం ఎన్.ఆర్.సి రూపొందించాలన్న నిర్ణయం జరిగింది. అస్సాంలోకి అక్రమంగా ప్రవేశించి స్థిరపడిన విదేశీయుల సంఖ్య 50 లక్షల మందిగా 1997లో నాటి హోంమంత్రి ఇంద్రజిత్ గుప్తా పార్లమెంటులో తెలిపారు. ఆ సంఖ్య అంతకంటే ఎక్కువేనని అస్సాం గవర్నర్ ఎస్.కె. సిన్హా ప్రకటించారు. 2004లో హోంశాఖ సహాయమంత్రి ప్రకాశ్ జైస్వాల్ ఆ సంఖ్యను 50 లక్షలని రాజ్యసభకు చెప్పారు. ఉద్యమకారులు ఈ సంఖ్యను కోటిమందిగా ప్రచారం చేస్తూ వచ్చారు. అయితే ఈ సంఖ్యలో కేవలం వూహాగానాలు మాత్రమేనని, వీటికి తగిన రుజువులు లేవని, ఆందోళనాకారులు చెప్తున్న గణాంకాలనే తాము ఉదహరిస్తున్నామని గవర్నర్ ఎ.కె. సిన్హా ఒక దశలో స్పష్టం చేశారు.

ఏమైనప్పటికీ కేవలం అపోహలతో, అవాస్తవాలతో కట్టుకథలతో సాగిన హింసాత్మక ఉద్యమం అస్సాం సమాజాన్ని విద్వేష సమాజంగా మార్చింది. అస్సాం ఒప్పందం అమలులో భాగంగా సాగిన ఎన్ఆర్‌సి ప్రక్రియ అస్సాం సమాజానికి తీరని గాయం చేసింది. తీవ్ర మానవ ఉత్పాతంగా తయారైంది. లక్షలాది కుటుంబాలు తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకునే క్రమంలో పడరాని ఇక్కట్లు పడ్డాయి. అవమానాలకు, వివక్షలకు గురయ్యాయి. భారత్‌లో జన్మించిన వారంతా భారతీయ పౌరులేనన్న పౌరసత్వ చట్టానికి అస్సాంలో తూట్లు పడ్డాయి. పౌరులలో కొందరు అసమాన పౌరులయ్యారు.

1951 నాటి ఎన్ఆర్‌సీ తయారీయే అసమర్థంగా, అపసవ్యంగా సాగింది. దానిని ఒక మౌలిక ఆధారంగా ప్రకటించడంతో ఆ నాటి తమ కుటుంబాల గుర్తింపును ధృవీకరించుకోవడానికి లక్షల మంది పడ్డ అవస్థలు వర్ణనాతీతం. తరచూ వరదల కారణంగా కొంపాగోడు కోల్పోయిన వారికి తగిన ఆధార పత్రాలు లేవు. ఆదివాసీల తెగల పేర్లు, కులాల పేర్లు, ఇంటిపేర్లు సరిగా లేని కారణంగా వారు చాలా ఇబ్బంది పడ్డారు. ముస్లిముల పేర్లు విషయంలో అయోమయం ఏర్పడింది. 1951-1971 మధ్య ఓటర్ల జాబితాల్లోని పేర్లతో తమ పేర్లను సరిపోల్చ లేక ఎంతో మంది ఇబ్బందులు పడ్డారు. తమ పౌరసత్వ గుర్తింపుకోసం సమాజం మొత్తంగా ఒక అమానవీయ ప్రక్రియలో ఇరుక్కుపోయింది. ఇంతటి పెను విషాదాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనలని తట్టుకుని ఎన్ఆర్‌సీ ప్రక్రియలో ప్రజలు పాలు పంచుకున్నారు. పౌరసత్వ చట్టాన్ని ఉల్లంఘిస్తూ సాగిన ఈ ప్రక్రియకు సుప్రీంకోర్టు మార్గదర్శకత్వం వహించడమే అతిపెద్ద విషాదం. గత్యంతరంలేని స్థితిలో, తగిన పత్రాలు చూపలేని వారి భవితవ్యం ఏమవుతుందో ఇంత వరకూ తేలలేదు. లక్షలాది మందిని ఏం చేస్తారో ఎవరికీ తెలియదు. విదేశీయులని రుజువైన వారిని డిటెన్షన్ క్యాంపుల్లో పెడతారంటున్నారు. ఇప్పటికే 3వేల మంది అటువంటి క్యాంపుల్లో మగ్గుతున్నారు. అందులో ఇప్పటికే మూడేళ్ళు ఉన్న వారిని బెయిల్‌పై విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వెనుకా ముందు చూడకుండా ఇటువంటి ప్రక్రియను నెత్తిన వేసుకున్న సుప్రీంకోర్టు దీనికి ఎటువంటి తార్కిక ముగింపు ఇస్తుందో చెప్పలేం! అస్సాంలో ఇంతటి మానవ విధ్వంసానికి కారణమైన ఎన్ఆర్‌సీ ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టాలని బీజేపీ నేతలు చేస్తున్న డిమాండ్ అత్యంత ప్రమాదకరమైనది. అది జాతీయ సమైక్యతకు సమగ్రతకు తీరని హాని చేస్తుంది. అస్సాంలో చేసిందే తప్పు.. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు అదో పనికిమాలిన చర్య. అక్కడే సరిగ్గా జరగలేదని విమర్శిస్తున్న బీజేపీ నేతలు దీన్ని దేశమంతా చేపట్టాలని కోరడం అర్థరహితం. అందులో ఎన్నో రాజ్యాంగ పరమైన చట్టపరమైన చిక్కులున్నాయి. ఇప్పటికే ఎన్ఆర్‌సీ పేరుతో అంతర్జాతీయ సమాజంలో మన పరువుపోయింది. దీన్ని మరింతగా దిగజార్చే చర్యలు ప్రమాదకరం. భారతీయ పౌరసమాజం ఈ ప్రక్రియని నిరోధించవలసి ఉంది.

డి. సోమ సుందర్

# అమెరికాలో జేపీ పిలుపుకి స్పందిస్తున్నాం..

**భారత్‌లో మార్పు తెచ్చే 6 రంగాల్లో భాగస్వాములమవుతాం!**

నాగేశ్వరరావు,
అమెరికా నుంచి

భారత్‌కున్న సత్తా - భారత్ సాధిస్తున్న ఫలితాలు.. ఈ రెంటి మధ్య అంతరాన్ని తొలగించేందుకు ఐదు కీలక రంగాల్లో తీసుకురావాల్సిన మార్పుల్ని వివరించి ప్రవాస తెలుగువారు, ప్రవాస భారతీయుల సహకారాన్ని, నాయకత్వాన్ని సమీకరించేందుకు లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అమెరికాలో పర్యటించారు.

రోజువారీ సమస్యలతో సతమతమయ్యే ప్రజలను చైతన్యపరచటంతోపాటు వారిని పరిష్కారాల్లో భాగమయ్యేలా నిలుస్తున్నాయని.. కానీ దేశంలో పాలనా సంస్కరణలు వస్తేనే సుస్థిరాభివృద్ధి సాధ్యమన్నారు.

భారతదేశ సామర్థ్యాన్ని వికసింప చేసి నూతన భారతదేశ నిర్మాణం చేయటం కేవలం ఆకాంక్షలతోనో, నినాదాలతోనే సాధ్యం కాదని, దేశంలో మార్పు తేగల మౌలిక రంగాలను, అందులో తేవాల్సిన మార్పుల్ని లోతుగా తెలుసుకోవాలని జేపీ అన్నారు. ఆ అంశాల్ని ప్రత్యక్షంగా షేర్ చేసుకునేందుకే తాను అమెరికా వచ్చానని తెలిపారు. ఈ పర్యటనలో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ ప్రతిపాదిస్తున్న ఐదు మౌలిక మార్పులూ పూర్తిగా



చేసేందుకు సొంత వనరులున్నవారు సమాజాన్ని, పార్టీలకతీతంగా రాజకీయాల్ని పట్టించుకోవాలని జేపీ ఎన్నారైలను కోరారు. స్వతంత్ర పోరాటకాలంలో దేశానికి గొప్ప నాయకత్వం సమకూరటానికి విదేశాల నుంచి కూడా భారతీయులు పెద్దఎత్తున సహాయసహకారాలతోపాటు నాయకత్వం అందించటం ప్రధాన కారణమన్నారు. ఈ ఏడాది 150వ జయంతి ఉత్సవాల్ని జరుపుకుంటున్న మహాత్మాగాంధీ భారత్‌ను పట్టించుకోకుండా దక్షిణాఫ్రికాలోనే ఉండిపోతే ఈవేళ్టి సువిశాల భారతదేశాన్ని మనం ఊహించను కూడా ఊహించలేమన్నారు. ప్రస్తుత ప్రపంచీకరణ పోటీ ఆర్థిక వ్యవస్థలో ఏ దేశంలో ఉన్నా, ఎన్నారైలు భారత్‌లో మార్పుకి గణనీయంగా దోహదం చేయగలరన్నారు. ఎన్నారైలు అందిస్తున్న అపార నిధులు భారత ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఆచరణసాధ్యమని, అన్ని పార్టీలూ ఆమోదించేవని అన్నారు. ప్రవాస తెలుగువారు, ప్రవాస భారతీయులు వీటిల్లో తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని.. అందులో సహాయసహకారాల్ని, నాయకత్వాన్ని అందించటం ద్వారా అందరికీ ఎదిగే అవకాశాలున్న నూతన భారతదేశ నిర్మాణాన్ని సాధించాలన్నారు.

బ్లూమింగ్‌టన్, డెలావెర్, న్యూజెర్సీ, సియాటెల్, శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా, లాస్‌ఏంజిల్స్-కాలిఫోర్నియా, మేరీల్యాండ్ తదితర నగరాల్లో జేపీ సమావేశాల్లో పాల్గొన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, హక్కుగా పౌర సేవలు, అధికార వికేంద్రీకరణ రంగాల్లో మార్పులను సమగ్రంగా వివరించారు. రేడియో టాక్‌షోల ద్వారా కూడా జేపీ తన ఆలోచనల్ని పంచుకున్నారు.

బ్లూమింగ్‌టన్ తెలుగు సంఘం వారు నిర్వహించిన సభలో..

తెలుగు రాష్ట్రాలు, భారత్‌లో విద్యారంగంలో ఉన్న సమస్యలను గణాంకాలు సహా జేపీ వివరించారు. విద్యావిధానంలో మెరుగైన ఫలితాలకు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేసేందుకు స్వతంత్ర టెస్టింగ్ ఏజెన్సీ ఏర్పాటు, వివిధ స్థాయిల్లో పాఠశాలల భాగస్వామ్యం వంటి పరిష్కారాలను తెలియజేశారు. అలాగే వ్యవసాయ రంగంలో పాలకుల విధానాలు ఎలా దేశంలోని కోట్లాది రైతుల ఆర్థిక, సామాజిక వృద్ధిని దెబ్బతీస్తున్నాయో తాజా ఉదాహరణలతో చెప్పారు. ప్రభుత్వాలు మారినా ప్రజాస్వామ్య మౌలిక సంక్షోభం ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలా కొనసాగుతోందో వింటుంటే షాకింగ్‌గా అనిపించింది. డెలావెర్ సమావేశంలో విద్య గురించి మరింత లోతైన విశ్లేషణను జేపీ ఎన్నారైల ముందుంచారు. ఎఫ్‌డీఆర్ ఇండియా రూపొందించిన సమాచారాన్ని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. మధ్యమధ్యలో అడిగిన అనేక సందేహాలను వివరంగా నివృత్తి చేశారు.

గురించి లోతుగా అవగాహన కల్పించారు. లోక్‌సత్తా భావజాలం గురించి మాలో కొంతమందికి పరిచయముంది. ఈసారి పర్యటనలో ఆయన చెప్పిన మౌలిక అంశాల గురించి కూడా పరిచయముంది. ఎందుకంటే జేపీ గారిని సోషల్ మీడియాలో ఫాలో అవుతుంటాం. అయినా కూడా అందులో ఇంత విషయముంది, దేశ సుస్థిరాభివృద్ధిలో వాటికి ఇంత ప్రాధాన్యముంది, పాలకుల విధానాలు వాటికి ఎంత దూరంగా ఉన్నాయి.. అనే అంశాల్ని తాజా సమావేశాల్లో తెలుసుకున్నాం. గంటలపాటు జరిగిన ఈ సమావేశాలు మాలో ఆసక్తిని, ఆలోచనను పెంచాయి. స్వదేశం పట్ల మాకున్న ప్రేమను ఈ రంగాల్లో సేవ ద్వారానే వ్యక్తం చేయాలని నిర్ణయించుకున్నాం.



విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి దళారీ వ్యవస్థను తొలగించి భారతీయ రైతులకు ఎలా ఆదాయాన్ని పెంచవచ్చో న్యూజెర్సీ సభలో జేపీ తెలియజెప్పారు.

భారత ప్రభుత్వం జీడీపీలో కేవలం 1% అదనంగా (మొత్తం కలిపి 2-3 శాతం) కేటాయిస్తే దేశంలో అందరికీ అమెరికా కంటే మెరుగ్గా (అమెరికాలో ఆరోగ్య వ్యయం జీడీపీలో 17 శాతం దాకా ఉంది) మంచి ఆరోగ్యాన్ని జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఎలా అందించవచ్చో మేరీలాండ్‌లో జేపీ వివరించారు. పౌర సేవల్ని బాగు చేయటం, ఓటుకు-ప్రజల జీవితాలకు సంబంధం ఉండేలా ఎన్నికల సంస్కరణల్ని తేవటం

"దేశ భవిష్యత్తు గురించి ఆందోళన, నిరాశ చెందాల్సిన అవసరం లేదు. మనమందరం ఆశావాదులుగా ఉంటూనూ సమాజహితం కోసం కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా చేయికలిపి అవసరమైనప్పుడల్లా హేతుబద్ధ వాదనలతో గొంతు విప్పుదాం, నాయకత్వాన్ని, చేయూతని అందిద్దాం" అని జేపీ ఇచ్చిన పిలుపుకి మేమందరం స్పందిస్తున్నాం. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, చట్టబద్ధపాలన, హక్కుగా పౌర సేవలు, అధికార వికేంద్రీకరణల్లో మాకిష్టమైన రంగంలో అవగాహనతో భాగస్వాములం అవుతాం, భారతదేశ శక్తిసామర్థ్యాలను వికసింపచేయటానికి అవసరమైన నాయకత్వాన్ని అందిస్తాం.

**(అమెరికాలో జేపీ ప్రసంగాలను ఆయన యూట్యూబ్ ఛానల్‌లో చూడవచ్చు. లింక్: https://www.youtube.com/channel/UCRjFUylgUaDpax-kBAt0xrw) (Dr Jayaprakash Narayan- Youtube).**

జనబలం
సెప్టెంబర్ 2019
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

# అందరికీ స్వతంత్ర ఫలాలు భవిష్యత్ కార్యాచరణ

**డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

స్వతంత్రం వచ్చి 72 ఏళ్ళు నిండిన సందర్భంగా తెలుగు ప్రజలకి, భారతీయులందరికి నా స్వతంత్ర దిన శుభాకాంక్షలు. 5000 సంవత్సరాల చరిత్ర ఉన్న ఒక జాతి జీవనంలో; 72 ఏళ్ళు అంత ఎక్కువ కాలం కాకపోవచ్చు కాని శరవేగంగా ఆర్థిక, సాంకేతిక, సామాజిక మార్పులు ప్రపంచమంతటా వస్తున్న ఈరోజులలో 72 ఏళ్ళు ఓ సుదీర్ఘకాలం. కాబట్టి స్వతంత్ర ఫలాలని క్లుప్తంగా సమీక్షించటానికి, జాతి భవిష్యత్తుకి బాటలు వేయటానికి, అనుభవ పాఠాలని ఆచరణలో పెట్టటానికి ఇది సరయిన అదను.

రోజువారి సమస్యలతో సతమతమవుతున్న మనం గత ఏడుదశాబ్దాలుగా సాధించిన విజయాలని పెద్దగా పట్టించుకోక పోవచ్చు. కాని చారిత్రక దృక్పథం లేకుండా, మన పునాదులని పట్టించుకోకుండా, మంచి భవిష్యత్తుని నిర్మించటం కష్టం. నేనీ వ్యాసాన్ని చాలా దూరం నుంచి, అమెరికాలో చికాగో నగర శివార్లలో వ్రాస్తున్నాను. మనం గౌరవించే పాశ్చాత్య ప్రజా స్వామ్యాలతో పోలిస్తే భారత్ ఎన్నో సవాళ్ళని అధిగమించి కొద్దికాలంలోనే ఉత్తమ ఫలితాలని సాధించింది. బ్రిటన్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియకి దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. అమెరికాలో 5 శతాబ్దాల యూరపు పునాదులు కాకుండా,



1619 నుంచి నాలుగు శతాబ్దాల ప్రజాస్వామ్య చరిత్ర ఉంది. పాశ్చాత్య దేశాలు మనతో పోలిస్తే పెద్దగా వైవిధ్యం లేని సమాజాలు. ఒకే భాష, మతం, ఒంటి రంగు, చరిత్ర, సంప్రదాయం– ఇవన్నీ ఉన్న సమాజాలలో కూడా ప్రజాస్వామ్య పరిణతికి, సమాజాలని ఏకోన్ముఖం చేయటానికి చాలా కాలం పట్టింది.

ఆ రకంగా పోల్చుకుంటే భారత్‌లో ఎంతటి అసాధారణ వైవిధ్యం ఉన్నా మనం సాధించిన విజయాలు అపూర్వమయినవి, స్ఫూర్తివంతమయినవి. 22 భాషలు, ప్రపంచంలో ఉన్న అన్ని మతాలు, లెక్కకు మించిన కులాలు, విభిన్న చారిత్రక అనుభవాలు, సంస్కృతులు, వీటన్నిటినీ మించిన కటిక బీదరికం– ఇవన్నీ 1947లో మన వారసత్వాలు. నిజానికి సరిగ్గా 100 ఏళ్ళ క్రితం, 1919లో, జలియన్‌వాలాబాగ్ దారుణ మారణకాండ జరిగేదాకా, దేశ నాయకత్వంగాని, సమాజంగాని బ్రిటీష్‌వారి నుంచి స్వతంత్రం కావాలని ఆలోచించలా. అంటే మన జాతి నిర్మాణం, స్వతంత్ర పిపాస, ప్రజాస్వామ్య ప్రక్రియ, రాజ్యాంగ వ్యవస్థలు– ఇవన్నీ కేవలం ఒక శతాబ్దంలో జరిగాయి. ఈ స్వల్పకాలంలోనే మనం చాలా గర్వించదగ్గ విజయాలని సాధించాం. ప్రపంచంలో ఎక్కడా చూడని రీతిలో 500కి పైగా సంస్థానాలను అనతికాలంలో హింస, రక్తపాతం లేకుండా స్వతంత్ర భారతంలో విలీనం చేయగలిగాం. దేశ విభజన సమయంలో చెలరేగిన అరాచకత్వాన్ని వేగంగా అదుపు చేసి ప్రశాంత పరిస్థితులని, సామరస్య వాతావరణాన్ని ఏర్పాటు చేయగలిగాం. ఊహకి అందనంత వైవిధ్యం ఉన్న జాతి ఐక్యతని, దేశ సమగ్రతని కాపాడుకోగలిగాం. బీదరికం, నిరక్షరాస్యత తాండవిస్తున్న దేశంలో వయోజన ఓటుహక్కుని, ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పి, స్వేచ్ఛని, మానవ హక్కులని, ప్రజల స్వపరిపాలనని కాపాడుకోగలిగాం. అధికారలాలస తరచు అదుపుతప్పినా, క్రమబద్ధంగా జరిగే ఎన్నికల ద్వారా శాంతియుతంగా అధికార మార్పిడిని ప్రజల అభీష్టం ప్రకారం సాధించగలుగుతున్నాం. భాషాప్రయుక్త రాష్ట్రాల ద్వారాను, అన్ని భాషలకి, మతాలకి, సంస్కృతులకి ఇచ్చిన సమగౌరవం, స్వేచ్ఛ ద్వారాను– ఐక్యతని, స్వేచ్ఛను కలపగలిగాం. మతం కారణంగా ముక్కలయిన దేశంలో మత స్వేచ్ఛని, సామరస్యాన్ని కాపాడగలిగాం. దేశ విభజన నేపథ్యంలో అధికార కేంద్రీకరణతో మొదలయిన రాజ్యవ్యవస్థలో కొంతమేరకయినా వికేంద్రీకరించిన ఫెడరల్ వ్యవస్థ నిలదొక్కుకుంది. ఎన్నో సమస్యలు, ప్రతికూల పరిస్థితులు, తరచు అసంబద్ధమయిన విధానాల మధ్య కొంతమేరకు ఆర్థిక, సాంకేతిక ప్రగతిని సాధించగలిగాం. చారిత్రక అవగాహన ఉన్నవారికి, ప్రపంచ ప్రజాస్వామ్య పరిణామాన్ని నిశితంగా పరిశీలించేవారికి, భారత్ సాధించిన ఈ విజయాలు ఎంత అసాధారణమో, అపురూపమో బోధపడతాయి.

ఇదంతా గత వైభవ కీర్తన కాదు. మనలాంటి సంక్లిష్ట సమాజంలోను, ప్రతికూల పరిస్థితులలోను కూడా సరయిన నాయకత్వం, వ్యవస్థాగత ఏర్పాట్లు, హేతుబద్ధ విధానాలు, ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడు ఎన్ని మంచి ఫలితాలు సాధించవచ్చో

పైన పేర్కొన్న విజయాలు రుజువు చేస్తాయి. నిజానికి మనలాంటి వైవిధ్యభరితమయిన, సంక్లిష్ట సమాజంలో నిజమయిన ప్రజాస్వామ్యం, సామాన్య ప్రజల భాగస్వామ్యం ద్వారా మాత్రమే దేశ ఐక్యతని, బీదరికం నిర్మూలనని, అందరికీ అవకాశాలని, అభివృద్ధిని సాధించగలం. ఆహార ధాన్యాలు, పాలు, గుడ్లు, ప్రత్తి వగైరా వ్యవసాయోత్పత్తులలో మనం సాధించిన విజయాలు సామాన్య రైతుల భాగస్వామ్యంతో, ప్రజల కృషితో మంచి విధానాలు తోడవటం వల్ల వచ్చాయి కాని, కేంద్రీకరణ వల్లనో, దైవదూతలయిన నాయకుల వల్లనో రాలేదు. అలాగే అవిద్య, అనారోగ్యం తాండవిస్తున్న దేశంలో చాలా ప్రాంతాలలో జననాల రేటు తగ్గి, జనాభా పెరుగుదల అదుపులోకి వస్తున్నదంటే, అది బీద కుటుంబాల ముందుచూపు వల్ల, తమ సంతానం తమ కంటే ఉన్నతులు కావాలనే తపన వల్ల జరుగుతోంది గాని, నియంతృత్వం వల్ల, కేంద్రీకరణ వల్ల కాదు. ప్రభుత్వం మంచి విద్యనందించటంలో ఘోరంగా విఫలమయినా, లక్షలాది మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఆధునిక సాంకేతిక రంగాలలో నిష్ణాతులయి ప్రపంచమంతటా గౌరవాన్ని, దేశంలో అభివృద్ధిని సాధిస్తున్నారంటే, అది మన సమాజంలోని ఆర్తి వల్ల, బలమయిన మన కుటుంబ వ్యవస్థ వల్ల, తరువాత తరానికి అన్ని అవకాశాలని అందించాలనే తల్లిదండ్రుల తపన వల్ల సాధ్యమవుతోందికాని, నాయకుల హుకుం వల్ల, అధికారుల చలవ వల్ల కాదు. రవాణా, టెలిఫోన్లు, సమాచార విప్లవం, అంతర్జాలాన్ని (ఇంటర్నెట్) వినియోగించుకోవటం– ఇవన్నీ ఆధునిక సాంకేతిక విప్లవం వల్ల, మన సమాజంలో సంపద సృష్టించేందుకు పోటీపడుతున్న ప్రతిభావంతుల వల్ల సాధ్యమవుతున్నాయికాని, ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల వల్ల కాదు.




ఇలా ఏ రంగంలో మంచి ఫలితాలు వచ్చినా, అందులో కీర్తి ప్రధానంగా మన సమాజానికి, సామాన్య ప్రజలకి దక్కుతుంది. ప్రభుత్వాల పాత్ర పరిమితం; కొన్ని సందర్భాలలో ప్రభుత్వాలు, అధికారమే పరమావధిగా ఉన్న రాజకీయ ప్రక్రియ ప్రజలకి సంకెళ్ళు వేసి అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి కాని, ప్రజల పన్నుల డబ్బుతో మనందరి ఉమ్మడి అవసరాలని సమర్థంగా తీర్చటం లేదు. ఈనాటి రాజకీయం, పాలన దేశ ప్రగతికి, ఆర్థికాభివృద్ధికి, బీదరికం నిర్మూలనకి దోహదం చేయకపోగా, చాలా సందర్భాలలో మన సమాజాన్ని వెనక్కి లాగుతున్నాయి.

పైన పేర్కొన్న మాటలు ఏదో పగతోనో, నైరాశ్యంతోనో చెప్పేవి కాద్ము మనం సాధించవలసింది ఇంకా చాలా ఉందని, మనందరికి సరయిన బాట వేయవలసిన మన రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థ మన ప్రగతికి ఆటంకమవుతోందని, గతానుభవ పాఠాలని మననం చేసుకుని పొరపాట్లని సరిదిద్దటానికి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవటానికి స్వతంత్రోత్సవ సంబరాలు సరయిన అదను అని గుర్తుచేయటానికి ఈ విశ్లేషణ చేయాల్సి వస్తోంది.

ఒక ప్రజాస్వామ్య దేశంగా, ఒక సమాజంగా మన ముందున్న సవాళ్ళని, మనం చేపట్టాల్సిన కార్యాచరణని మూడు స్థూలమయిన అంశాలుగా పరిశీలించవచ్చు.

మన ముందున్న మొదటి సవాలు బీదరికం నిర్మూలన; కులవివక్షని, అందువల్ల పెరుగుతున్న అసమానతలని తొలగించటం; అందరు బిడ్డలకి, అన్ని కుటుంబాలకి, పుట్టుకతో సంబంధం లేకుండా ఎదిగే అవకాశాలని కల్పించటం, ఆదాయాలని పెంచటం. ఈ లక్ష్యాలని సాధించాలంటే ఆధునిక యుగంలో ప్రపంచమంతటా అనుసరిస్తున్న మార్గాలు, ఫలితాలనిస్తున్న మార్గాలు మూడు– ఆ మూడు మార్గాలు ప్రత్యామ్నాయాలు కావు, అవి అవిభాజ్యమైనవి. ఆ మూడు మార్గాలు కలిస్తేనే బీదరికం నిర్మూలన, ఆర్థిక ప్రగతి, సంపద సృష్టి, అందరికీ అవకాశాలు సాధ్యమవుతాయి. ఈ మూడు రంగాలలో మన పరిస్థితి చాలా మేరకు అధ్వాన్నంగా ఉంది. ఈ మూడింటిలో మౌలిక మార్పులు తెచ్చి ఫలితాలని ప్రజలకి అందించటం నేటి తక్షణావసరం.

మొదటి మార్గం: ప్రతి బిడ్డకి మంచి ప్రమాణాల విద్యని, ఉపాధికి పనికివచ్చే నైపుణ్యాన్ని ఆర్థికభారం లేకుండా

అందించటం, ప్రతి కుటుంబానికి అన్ని స్థాయిలలో ఖర్చు లేకుండా మంచి ఆరోగ్య సేవలనందించటం. ఈ అన్ని అంశాలలోను మన దేశం పరిస్థితి చాలా పేలవంగా, బాధాకరంగా ఉంది. విద్య, నైపుణ్యాల రంగంలో ప్రభుత్వం చాలా ఖర్చు పెడుతున్నా నూటికి 80 మంది పిల్లలకి కనీస ప్రమాణాల విద్య అందటం లేదు. ప్రస్తుతం పెడుతున్న ఖర్చు పరిమితిలోపలే మంచి ప్రమాణాల విద్యని అందించటం సాధ్యం, అవసరం. మంచి విద్య అందితేనే బీదరికం నిర్మూలన, కులవివక్ష అంతం, అందరికీ అవకాశాలు సాధ్యం. మరే పద్ధతిలోను నేటికాలంలో నిజమయిన అభివృద్ధిని సాధించటం సాధ్యం కాదు. ఇక ఆరోగ్యానికి మనం పెట్టే ప్రభుత్వ ఖర్చు జాతీయాదాయంలో 1 శాతం మాత్రమే– అంటే ఆరోగ్యాన్ని బాగా నిర్లక్ష్యం చేస్తున్న దేశాల సరసన భారతదేశం ఉంది. ఆ కారణంగా బీదరికం కొనసాగుతోంది; ఉత్పాదకత తగ్గుతోంది; కోట్లాదిమంది నివారించదగ్గ క్లేశానికి, అకాల మరణానికి గురవుతున్నారు. ఈ ఆరోగ్య వ్యవస్థని బాగుచేసి ప్రజలందరికి



జేబులోంచి ఖర్చులేకుండా మంచి ఆరోగ్యాన్ని అందించాలంటే కనీసం అదనంగా 1 శాతం (జాతీయ ఆదాయంలో) కేటాయించాలి; ఆ డబ్బుని విజ్ఞతతో, మనకున్న అవకాశాలని, బలాలని ఉపయోగించుకుని పొదుపుగా వినియోగించాలి. అలా చేస్తే కేవలం 2 శాతం ఖర్చుతో మంచి ఆరోగ్యాన్ని అందరికీ అందించే పరిస్థితులు మనదేశంలో ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో మంచి ఆరోగ్యానికి ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చు జాతీయాదాయంలో 8–10 శాతం! కనీసం 2 శాతాన్ని 'సరైన రీతిలో' మనం ఖర్చు పెట్టలేకపోతే బీదరికాన్ని తొలగించాలన్న సంకల్పం మాటలకే పరిమితం అవుతుంది.

బీదరికం తొలగించటానికి రెండో కీలక మార్గం మౌలిక సదుపాయాల కల్పన. దాదాపు అన్ని మౌలిక సదుపాయాలలోను 49 పెద్ద దేశాలతో పోలిస్తే భారత్ అన్ని రంగాలలోను అట్టడుగు 5 స్థానాలలో ఉంది. మంచినీరు, వరదనీటి పారుదల, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం, విద్యుత్తు, రోడ్లు, రవాణా– వీటన్నింటిని మెరుగుపరచటం అవసరమన్నది నిర్వివాదం. కాని మన చేతలు అవసరాలని ప్రతిబింబించటం లేదు. కేంద్ర బడ్జెట్టులో అప్పుల మీద వడ్డీల చెల్లింపుకి రూ. 6,65,000 కోట్లు ఖర్చు చేస్తుంటే, అందులో సగం కూడా మౌలిక సదుపాయాల కల్పనకి కేటాయించటం లేదు! యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయాలని కల్పిస్తేనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది.

ఉపాధి కల్పనకి, బీదరిక నిర్మూలని మూడో కీలక మార్గం కొత్త పరిశ్రమలు, వ్యాపారాలు, పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలు, పద్ధతులు. అడుగడుగునా లంచాలు మింగి వేధించే వ్యవస్థలో పేదలకి న్యాయం జరగదు, పెట్టుబడులు రావు. భూమి, కార్మికులు, రుణం– ఈ మూడు రంగాలలో పెట్టుబడులని, పోటీని పెంచి ఉపాధి కల్పన చేయటానికి అవసరమయిన మార్పులని వెంటనే తేవటం అత్యవసరం. ప్రతి నెలా 11 లక్షలమంది మన దేశంలో కొత్తగా ఉపాధిని ఆశిస్తూ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. కాని మన విధానాలు, ఆంక్షలు, లంచాలు, ప్రభుత్వ గుత్తాధిపత్యం పెట్టుబడులకి, పోటీకి, ఉపాధి కల్పనకి, ఉత్పత్తికి, ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా తయారయినాయి. ఈ మూడు రంగాలని– మానవాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన– సమూలంగా సంస్కరించి ఫలితాలని సాధిస్తేనే దేశం ముందున్న తొలి సవాళ్ళని ఎదుర్కొని – బీదరికం, వివక్ష, కులవ్యవస్థలని అంతం చేయటం; ఉపాధిని కల్పించి సంపదను పెంచటం సాధ్యమవుతాయి.

ఇక మన దేశం ఎదుర్కొంటున్న రెండవ పెద్ద సవాలు – ప్రజాస్వామ్యం పేరుకి ఉన్నా అధికారాన్ని చెలాయించే తీరు, స్థాయి చాలామేరకు అప్రజాస్వామికంగా, ప్రజాప్రయోజనాలకి వ్యతిరేకంగా ఉండటం. ఈ సవాలులో రెండు అంశాలు– చట్టబద్ధపాలన, అధికార కేంద్రీకరణ ఇమిడి ఉన్నాయి.

మొదటి అంశం చట్టం అధికారంలో ఉన్నవారికి బందీగా మారిపోవటం. పేరుకి మన వ్యవస్థలో చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. అలాగే ప్రతి ఒక్కరు– ప్రధానమంత్రి నుంచి బంట్రోతు వరకు– చట్టానికి లొంగి ఉండాలి. అంటే చట్టం పాలిస్తుందికాని వ్యక్తులు కాదు. కాని వాస్తవానికి చట్టం అధికారంలో ఉన్నవాళ్ళకి, కండబలం ఉన్నవాళ్ళకి, డబ్బున్నవాళ్ళకి బందీ అయిపోయింది. పోలీసు యంత్రాంగం చట్టానికికాక అధికారానికి లోబడి పనిచేయాల్సి వస్తోంది. న్యాయస్థానాలకి స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నా న్యాయమూర్తుల కొరత వల్ల, కోట్లాది కేసులు పేరుకుపోవటం వల్ల, సామర్థ్యాన్ని, జవాబుదారితనాన్ని నిర్లక్ష్యం చేయటం వల్ల, న్యాయం అందే పద్ధతిని నిర్దేశించే చట్టాలు (ప్రొసిజ్యురల్ లాస్) – సి.ఆర్.పి.సి, సి.పి.సి ఎవిడెన్స్ చట్టం– లోపభూయిష్టం కావటం వల్ల నిజానికి సామాన్యులకి న్యాయం అందటం దుర్లభమయింది. చట్టబద్ధపాలనలేని సమాజంలో అధికారబలం, కండబలం, ధనబలం రాజ్యమేలతాయి;నిజాయితీకి, ప్రతిభకి, న్యాయానికి స్థానం ఉండదు; అధికారంలో ఉన్నవాళ్ళ నిరంకుశత్వానికి,

అవినీతికి అడ్డుకట్ట ఉండదు. కాబట్టి ప్రజాస్వామ్యాన్ని బ్రతికించుకుని అందరికీ సమన్యాయం అందించాలంటే పోలీసులు, న్యాయవ్యవస్థ, చట్టాలు – వీటన్నింటిలో సమూల సంస్కరణలను చేపట్టాలి. లేకపోతే బడితె ఉన్నవాడిదే బర్రె అవుతుందికాని, నాగరిక సమాజం, ప్రజాస్వామ్యం నిస్సారమవుతాయి.

ఇక కేంద్రీకృత పాలనలో ప్రజాస్వామ్యం నేతిబీరకాయలో నెయ్యిలాంటిది. నిజమయిన ప్రజాస్వామ్యం అంటే పౌరులకి అతి దగ్గరగా, వారికి అర్థమయ్యేరీతిలో, వారికి ప్రమేయంతో, వారి జీవితాలని ప్రభావితం చేసేలా నిర్ణయాలు, వాటి అమలు జరగాలి. ప్రజల ఓటుకి – వారి దైనందిన జీవితానికి; మనం కట్టే పన్నులకి – మనకందే సేవలకి; అధికారానికి – బాధ్యతకి మధ్య బాగా దగ్గర సంబంధం ఉన్నప్పుడే ఓటు సార్థకమవుతుంది; ప్రజల రోజువారి వత్తిడితో పరిస్థితులు బాగుపడతాయి; పన్నుల డబ్బుతో సేవలు, మౌలిక సదుపాయాలు అందుతాయి. కేంద్రీకృత పాలనలో పరిపాలన మేడిపండులాంటిది; పొట్టవిచ్చి చూస్తే పురుగులుంటాయి. ఓటుకి డబ్బు, లేదా దీర్ఘకాల ప్రయోజనాలని తాకట్టు పెట్టి తాత్కాలిక తాయిలాలు రాజ్యమేలతాయి. ఇదే ఇప్పుడు దేశంలో జరుగుతున్నది. కాబట్టి బలమైన ఫెడరల్ వ్యవస్థ, దేశ ఐక్యతను కాపాడుతూనే జవాబుదారీతనంతో కూడిన స్థానిక ప్రభుత్వాలు అత్యవసరం. ఈ రెంటినీ– చట్టబద్ధపాలనని, అధికార వికేంద్రీకరణని– పూర్తిగా సాధించేవరకు స్వతంత్ర ఫలాలు మన ప్రజలకి నిజంగా అందవు.




స్వతంత్ర భారతంలో మనమెదుర్కుంటున్న మూడో కీలక సవాలు– ధన రాజకీయం, దోపిడీ రాజకీయం, అధికార క్రీడ సర్వస్వం కావడం, రాజకీయమంతా అధికారాన్ని పొందటానికే సాధనం కావటం. ఓట్ల కొనుగోలు, తాయిలాలు, కుల, మత, ప్రాంతీయ విభజనలతో ఓటు బ్యాంకులు, అవినీతి, పౌర సేవల వైఫల్యం– ఇవన్నీ మన ప్రజాస్వామ్యాన్ని, స్వతంత్రాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ప్రపంచంలో ఎక్కడా లేనంత స్థాయిలో ఎన్నికలలో అక్రమ ఖర్చు పెరిగిపోయింది. రాజకీయంలో ఉన్న సమర్థులు, నిజాయితీపరులు కూడా విషవలయంలో బందీలయిపోతున్నారు; లేదా ప్రజాజీవనం నుంచి నిష్క్రమించాల్సి వస్తోంది. దీనికి పార్టీలనో, నాయకులనో తిట్టిపోయటం నిరర్థకం– వారంతా వ్యవస్థలో ఉన్న లోపాలకి బందీలు, బాధితులు. ఈ రాజకీయ సంక్షోభాలకి మూల కారణాలని విశ్లేషించటానికి ఈ వ్యాసం చాలదు. కాని వాస్తవాలని చిత్తశుద్ధితో పరిశీలించేవారందరికి మనం ఎలాంటి సంక్షోభంలో చిక్కుకున్నామో స్పష్టంగా అర్థమవుతోంది. సర్వశక్తులు అధికారాన్ని పొందటానికి, ఆ తరువాత అధికారాన్ని కాపాడుకోటానికే వినియోగించే పరిస్థితి వచ్చింది. మంచి పాలన, పన్నుల డబ్బు సద్వినియోగం, ఉమ్మడి అవసరాలు తీర్చటం– ఇవన్నీ చాలామేరకు మాటలకి, కొన్ని మొక్కుబడి సంకేతాలకి, చర్యలకి పరిమితమ యినాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇతర సమాజాలని చూస్తే మనమెంత నష్టపోతున్నామో బోధపడుతుంది.

విషవలయంలో బందీలయిన రాజకీయులని తిట్టిపోయటం కాక, సామర్థ్యాన్ని, నిజాయితీని, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ఎన్నికల సంస్కరణలని వెంటనే చేపట్టటం అవసరం. రాష్ట్రాలలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరచటం, దామాషా పద్ధతి ద్వారా రాజకీయాల రూపురేఖల్ని మార్చటం, పార్టీలలో చట్టబద్ధ అంతర్గత ప్రజాస్వామ్యం ద్వారా పార్టీలని ప్రజల వేదికలుగా మార్చటం– ఈ మూడు మౌలిక మార్పులని తెచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ప్రజల చేతుల్లోకి వచ్చి ధనస్వామ్యం, దోపిడీరాజ్యం అంతమవుతాయి.

మరో మూడేళ్ళలో మన స్వతంత్రానికి 75 ఏళ్ళు నిండుతాయి. ఇతర దేశాలతో పోలిస్తే మనం కొన్ని రంగాలలో గొప్ప విజయాలు సాధించాం. అలాగే మరెన్నో రంగాలలో తీవ్ర వైఫల్యాలని చవిచూశాం. పాశ్చాత్య దేశాల మాదిరిగా కొన్ని వందల ఏళ్ళు ఓపికగా ఆగి, కాలక్రమేణా ప్రజాస్వామ్యాన్ని బాగుచేయటం మనకి ఆత్మహత్యాసదృశం. కాలం మనకి పెద్ద శత్రువు. పెరుగుతున్న జనాభా, నిరుద్యోగంతో నిస్సహాయులవుతున్న కోట్లాది యువత, కనీస ఆశలు నెరవేరక నష్టపోతున్న కోట్లాది బీదకుటుంబాలు, ప్రపంచవ్యాప్తంగా శరవేగంగా మారుతున్న సాంకేతిక విజ్ఞానం, ప్రపంచీకరణ నేపథ్యంలో మన వైఫల్యాల వల్ల వచ్చిన అవకాశాలని గబగబా అందుకుని ముందుకి పరిగెడుతున్న ఇతర వర్ధమాన దేశాలు, సంపన్న దేశాలలో పెరుగుతున్న అసహనం, మనకందనంతగా ఎదిగి మన పక్కలో బల్లెంగా మారిన చైనా అగ్రరాజ్యంగా అవతరించటం – ఇవన్నీ మన ప్రమేయం లేకుండా జరుగుతున్న ప్రపంచ పరిణామాలు. కాబట్టి గతానుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని పొరపాట్లని వేగంగా సరిదిద్దుకుంటేనే– ఒక దేశంగా మన గౌరవాన్ని పొందగలం, మన యువతకి, తరువాతి తరానికి న్యాయం చేయగలం. చిత్తశుద్ధి, నిజమయిన దేశభక్తి ఉంటే 75వ స్వతంత్ర దినోత్సవం నాటికి ఈ మార్పులకి శ్రీకారం చుట్టి జాతి భవిష్యత్తుకి రహదారి వేయటం సాధ్యం; నేటి చారిత్రక అవసరం.

# ఎన్నికల మేనిఫెస్టోలు- భారత రాజ్యాంగం

ఎన్నికల మేనిఫెస్టో అనేది బైబిల్, ఖురాన్, భగవద్గీతలా పవిత్రమైనదని, 2019 ఎన్నికల్లో తమ పార్టీ ఇచ్చిన హామీల ప్రణాళికలోని నవరత్నాలు రోజూ కనిపించేలా బల్ల మీద పెట్టుకుని నూరుశాతం అమలు చేస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. మంత్రులు, పార్టీ నేతలు, కలెక్టర్లు, ఉద్యోగులు, వలంటీర్లు కూడా దీన్నే ఫాలో అవ్వాలని స్పష్టం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కూడా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసి తీరతామని, చెప్పనివి కూడా చేస్తున్నామని చెబుతున్నారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో చెప్పాం కాబట్టే జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని నిష్క్రియం చేసి, 35ఎ ని తొలగించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆయన పార్టీ వారు విమర్శకుల నోళ్లు మూయించే ప్రయత్నం చేస్తున్నారు.




కానీ రాజకీయ పార్టీలు ఎన్నికల హామీల్ని అమలు చేయటం లేదు కాబట్టి.. అంటూ అభ్యర్థుల చేత బాండ్ పేపర్ మీద రాయించి సంతకం తీసుకోవాలని 2019 ఎన్నికల సమయంలో హుషారుగా ప్రచారం చేసినవారిని కూడా మేనిఫెస్టోల అమలు పేరుతో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్ విషయంలో బీజేపీ దూకుడు షాక్‌కి గురిచేసింది.

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రత్యేకహోదా హామీని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేయకపోవటంతో ఈ బాండ్ పేపర్ రాత వాదన బలంగా మొదలై తెలంగాణలో స్థానిక హామీల దాకా కూడా విస్తరించింది. కొన్ని చోట్ల పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులే స్వయంగా హామీలపై బాండ్ రాసి సంతకం పెట్టి ప్రజలకిచ్చారు. కానీ చెప్పిన మాటను నెరవేరుస్తున్నామంటూ నవరత్నాలు, భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులు, కాశ్మీర్‌లో 370 అమలు రద్దు వంటి విషయాల్లో పాలకులు అనుసరిస్తున్న వైఖరి ఇప్పుడు ఇలాంటి వారికి కూడా కొరుకుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో, ఎన్నికల హామీలతోపాటు మేనిఫెస్టోల అమలు తీరుపై కూడా విస్తృత చర్చ అవసరమని ప్రజాస్వామ్యవాదులు భావిస్తున్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో చాలావాటిని అధికారంలోకి వచ్చిన పార్టీలు నెరవేరుస్తున్నాయనే చెప్పాలి. కొన్నిటిని వాయిదా వేస్తున్నాయి లేదా మెలికలు పెడుతున్నాయి తప్ప.. అమలు చేయము అని చెప్పటం లేదు. కానీ మేనిఫెస్టోల్లోని చాలా అంశాలు 'తాత్కాలిక తాయిలాలు కావటం, ప్రజల జీవితాల్ని మార్చగలిగే అంశాల అమలు కూడా తాత్కాలిక ప్రయోజనాలకు మాత్రమే పరిమితమయ్యేట్లు ఉండటం, వాటిని

కూడా తాత్కాలిక తాయిలాల్లా అమలు చేయటమే పెద్ద సమస్య'గా ఉంది! అందుకే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను అప్పులు చేసి మరీ పాలకులు అమలు చేస్తున్నా పరిష్కారాలు లభించటం లేదు, జనం జీవితాలు పెద్దగా మారటం లేదు. దీంతో అన్ని వర్గాల్లో అసంతృప్తి ఏదోకరూపంలో పెరుగుతూ పోతోంది. అభివృద్ధిపరంగా కూడా దేశం పెద్ద మూల్యమే చెల్లిస్తోంది. మేనిఫెస్టోల అమలు కన్నా, ప్రభుత్వాల ప్రభావం కన్నా.. సమాజం ప్రభావమే ప్రజల జీవితాలను ఉన్నంతలో అభివృద్ధిలోకి నడిపిస్తోందంటే అతిశయోక్తి కాదు.

తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే.. రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోల్లో రుణ, వడ్డీ మాఫీలు, ఉచితాలను ఇబ్బడిముబ్బడిగా హామీ ఇచ్చాయి. ప్రభుత్వాలకు సంబంధం లేని పెళ్లిళ్ల ఖర్చు, మత సంస్థల్లో వేతనాలు వంటి వాటిని కూడా ఇస్తామని ప్రకటించేశాయి. కులసంఘాల పేరుతో భవనాలు, కేటాయింపులకు హామీ ఇచ్చాయి.. ఇప్పుడే కాదు గత కొన్ని ఎన్నికల నుంచే ఈ ధోరణి ఆనవాయితీగా తయారైంది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వమైతే, వైకాపా ఎన్నికల మేనిఫెస్టోలోని కొన్ని అంశాలను ఏపీలో ఎన్నికలకు ముందే పేర్లు మార్చి అమలుచేసేసింది. ఓటుకు నోటు అన్నట్లు ప్రజాధనాన్నే ఆరకంగా పందేరం చేశారు. తర్వాత ఎన్నికలలో గెలిచిన వైఎస్ జగన్.. బాబు కాపీయింగ్‌పై రాజకీయ విమర్శ చేశారు గానీ, నవరత్నాల్ని పందేరాల్లా అమలు చేస్తే ప్రయోజనం ఉండదన్న అంశాన్ని తెదేపా ప్రభుత్వ అనుభవం నుంచి కూడా గుర్తించలేదు. అందుకే తన తొలి బడ్జెట్‌లో నవరత్నాలకు కేటాయింపుల్ని చూపారు తప్ప.. వాటి వల్ల ప్రజలకు ఎంత మేలుజరుగుతుంది, ప్రతి రూపాయినీ సద్వినియోగం చేయటం ఎలా? అన్న పరిశీలన చేయలేదు. హామీ ఇచ్చాం కాబట్టి ఆర్టీసీ ప్రయివేటీకరణ వంటి నిర్ణయాల్ని అమలు చేయాల్సిందే అంటున్నారు తప్ప, దాని వల్ల ప్రజలకు లాభమా? నష్టమా? అని పట్టించుకోవటం లేదు.

## పాలనలో విఫలమైతే విశ్వసనీయత వ్యక్తిగతానికే పరిమితమవుతుంది

2019 ఎన్నికల నాటికి చంద్రబాబు తన పాలనా ప్రత్యేకతను కోల్పోయి, జగన్‌కు, బాబుకు తేడాలేదనే స్థాయికి వచ్చినప్పటికీ.. ప్రజలు భారీ మెజారిటీతో జగన్‌ను గెలిపించటానికి ఆయన విశ్వసనీయత కూడా ఒక పెద్ద కారణమనటంలో సందేహం లేదు. ప్రత్యేక హోదా, ఇంకా కొన్ని ముఖ్యమైన అంశాలలో మాట మార్చిన తీరు చంద్రబాబు విశ్వసనీయతను బాగా దెబ్బతీసింది. అందుకే ముఖ్యమంత్రయ్యాక కూడా జగన్.. విశ్వసనీయత అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తూ దాన్ని కాపాడుకోవటానికి చాలా ప్రాధాన్యతనిస్తున్నారు. ఆయన భావిస్తున్నట్లు.. ఎన్నికల మేనిఫెస్టోలోని నవరత్నాలను రాజీలేకుండా అమలు చేయటం విశ్వసనీయతలో భాగమేకానీ, వాటి వల్ల ప్రజలు ఆశిస్తున్న ఫలితం దక్కకపోతే పాలన, రాజకీయంలో విఫలమై ఒట్టి వ్యక్తిగత విశ్వసనీయతే మిగులుతుంది. అందుకే నవరత్నాల అమలుకు సరైన విధానాలను రూపొందించుకోవాలి. రాజ్యాంగ ప్రజాస్వామ్య లక్ష్యాలకు– సమాజానికీ మధ్య అంతరం తొలగించేలా మేనిఫెస్టో అమలు ఉండాలి. రాజకీయాల్లో ఎన్నికలు, ఎన్నికల మేనిఫెస్టో ఎంతో ముఖ్యమైనవి, కానీ అన్నిటికంటే ముఖ్యమైనవి ప్రజలకు సాధికారతనిచ్చే భారత రాజ్యాంగ లక్ష్యాలు!

రాజ్యాంగ స్ఫూర్తి ప్రాతిపదికన రూపొందించిన విధానాలతో అమలైతేనే.. హామీలు, నినాదాల వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

రాజ్యాంగ ప్రజాస్వామ్య లక్ష్యాలకు – సమాజానికి మధ్య అంతరాన్ని తొలగించే దిశ (విధానాలు) సక్రమంగా లేకపోతే.. ఎంత ఆకర్షణీయమైన ఎన్నికల మేనిఫెస్టో అయినా, దాన్ని ఎంత విశ్వసనీయతతో తూ.చ మాట తప్పకుండా అక్షరాలా అమలు చేసినా రాజకీయ పార్టీలకి, అధికారానికి, ప్రభుత్వాలకి అర్థం ఉండదు. అందుకే 'ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించటానికి.. సమానస్థాయిని, అవకాశాల్ని కల్పించటానికి ..వ్యక్తి గౌరవాన్ని పరిరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించటానికి' భారత రాజ్యాంగం తన పీఠికలో ఇచ్చిన నిర్దిష్ట హామీ ఆచరణలోకొచ్చేలా నవరత్నాల్ని అమలు చేయాలి.

## ఏపీ ప్రభుత్వ బడ్జెట్‌లో కొరవడిన 'మౌలిక' ప్రయత్నం

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఎప్పట్నుంచో చెబుతున్నట్లు.. దేశ ఐక్యతకు, సమగ్రతకు భంగం కలగనిరీతిలో రాష్ట్రాలకూ ప్రత్యేక రాజ్యాంగాలుండొచ్చు. రాజ్యాంగంలోని కొన్ని అంశాలను కూడా కాలానుగుణంగా సరిదిద్దుకోవాల్సి ఉండొచ్చు. కానీ భారత రాజ్యాంగ పీఠిక, దాన్ని అమల్లోకి తెచ్చేందుకు పొందుపరిచిన సూత్రాల సమాహారం మాత్రం దేశం మొత్తానికీ కాలతీతమైన దిక్సూచే. అందుకే రాజ్యాంగం హామీ ఇచ్చిన చట్టబద్ధపాలన, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు, సామాజిక న్యాయాలను సాధించటానికి అనుగుణంగా నవరత్నాలను అమలు చేయాలి. ఎన్నికల ప్రణాళికలో నవరత్నాల రూపంలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి మౌలిక, ప్రధానాంశాలకు సంబంధించి ఇచ్చిన హామీలను తాత్కాలిక తాయిలాల రూపంలో కాకుండా.. జేబులో నుంచి ఖర్చు లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రతి రైతుకూ లాభసాటి వ్యయసాయం, ప్రతి పౌరునికీ ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, తక్కువ ఖర్చుతో స్థానికంగానే

వెంటనే న్యాయం వంటి మార్పులను సాధించే రూపంలో అమలు చేయాలి. కానీ దురదృష్టవశాత్తూ ఆ ప్రయత్నం జగన్ ప్రభుత్వ బడ్జెట్‌లో కొరవడింది.

2019 ఏపీ బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలలో కేటాయింపుల్ని దాదాపు 34 శాతం చొప్పున పెంచినా, ఆ రంగాలలో నాణ్యత గురించిన ప్రస్తావనే లేదు. ప్రభుత్వం స్కూలుకు వెళ్లే ఒక్కో బిడ్డ మీద ఏడాదికి రూ.90,000 దాకా ఖర్చు పెడుతున్నా, ఎందుకు నాణ్యమైన చదువు రావటం లేదు? 8వ తరగతి చదువుతున్నవారిలో కూడా మాతృభాషలో ఒక పేరాని చదవలేనివారు పెద్దసంఖ్యలో ఎందుకుంటున్నారు? సాధారణ భాగాహారాలు, రెండంకెల తీసివేతలు వంటివి చేయలేనివారు పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో ఎందుకున్నారు?.. వంటి చర్చ లేకుండా కేటాయింపులనే గొప్పగా చెప్పుకుంటున్నారు. జగనన్న అమ్మ ఒడి పథకం కింద ఇంటర్మీడియెట్ స్థాయి వరకు చదువుకునే పిల్లలున్న అమ్మలకు ఆర్థిక సాయం అందించేందుకు రూ.6445.80 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అందులోని పిల్లల్లో 80 శాతం మందికి సరిగా చదువు రాకుంటే, ఆ పథకాన్ని ఓట్ల కోసం ప్రవేశపెట్టిన తాత్కాలిక తాయిలమంటారా లేక పనికొచ్చే పథకమంటారా?

అలాగే ఆరోగ్య రంగంలో. రాష్ట్రంలోనే కాక సమీప రాష్ట్రాల్లోని హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి చోట్లా ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కానీ ఆరోగ్యశ్రీ మొదలైన దగ్గర్నుంచి గత పుష్కర కాలంలో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు లాభం జరిగింది తప్ప ప్రజలకు ఆరోగ్యం అందలేదు అన్న వాస్తవాన్ని మాత్రం జగన్ ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే తీసుకుంటే.. ఏపీలో తెల్ల రేషన్ కార్డు ద్వారా ఈ పథకం కింద 3.5 లక్షల మంది సేవలు పొందగా, వీరిలో 75.76% మంది ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లోనే వైద్యం పొందారు. 24.24% మంది మాత్రమే ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స అందుకున్నారు.

## వ్యవసాయం తప్ప.. సేవ, పరిశ్రమల రంగాల్లో ఇప్పుడు అవకాశాలు తక్కువట!?

అలాగే రైతు సంక్షేమానికి కృషి చేస్తూనే వ్యవసాయానికి- పరిశ్రమలకు సంధానం చేయటానికి బదులు "నూతన రాష్ట్రమైన ఏపీలో ఈ సంధికాలంలో వ్యవసాయం తప్ప.. ఇతర రంగాలైన సేవ, పరిశ్రమల రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు తక్కువే" అని వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ప్రభుత్వం చేసిన ప్రకటన రాష్ట్ర భవిష్యత్తుకు ఆందోళనకర ఘంటికే. 'సేవారంగం బలహీనంగా ఉండటం, వ్యవసాయ రంగం వాటా ఎక్కువ ఉండటం - ఈ రెండూ ఒక ఆధునిక ఆర్థిక వ్యవస్థ బలహీనతని, వెనుకబాటుతనాన్ని సూచిస్తాయి' అని ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీల అమలుపై లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ చొరవతో స్వతంత్ర నిపుణుల బృందం (ఐజీఈ) ఫెడరల్ స్ఫూర్తితో రూపొందించిన నివేదిక వ్యాఖ్యానించటంతోపాటు.. వ్యవసాయంతోపాటు సేవ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఆచరణీయమైన నిర్దిష్ట పరిష్కారాలను సూచించింది. ఈ నివేదికను డా॥ జేపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కూడా పంపారు. ఈ పరిష్కారాల గురించి ఆలోచన చేయకుండా, యథాతథ స్థితినే కొనసాగిస్తాం, తిరోగమనమైనా మాకు నచ్చినట్లే చేస్తామన్నట్లు బడ్జెట్ విజన్‌లో ప్రభుత్వం వ్యవహరించటం విచారకరం. పరిశ్రమల స్థాపనకు ముఖ్యమంత్రి చేస్తున్న కొన్ని ప్రయత్నాలు కూడా.. ఏదోకరకంగా వీలైనన్ని పరిశ్రమల్ని తెద్దామని కాకుండా, తనకు వ్యక్తిగతంగా, రాజకీయంగా బాగా ఉపయోగముంటేనే పరిశ్రమల్ని తెద్దామన్నట్లు ఉండటం వల్ల ఏపీకున్న స్వాభావిక శక్తిసామర్థ్యాల్ని అభివృద్ధి దిశగా వికసించేయటంపై అనుమానాలు పెరుగుతున్నాయి.


గ్రామ సచివాలయాల విషయంలో కూడా ప్రజల సాధికారత, ప్రజల పన్నుల డబ్బు సద్వినియోగం అనే రాజ్యాంగ బాధ్యతల్ని వైఎస్ జగన్ విస్మరించారు. ఊరికో సచివాలయాన్ని నేను హామీ ఇచ్చాను, చేయాల్సిందే.. అని పట్టుబట్టారు తప్పితే, అంతమంది సిబ్బంది ఎంత జనాభాకు అవసరం? అని ఆలోచించలేదు. పదివేల జనాభాకు ఓ సచివాలయం సరిపోయే పరిస్థితి ఉంటే.. రెండు వేల జనాభాకు ఓ గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజలకు హేతుబద్ధంగా సిబ్బంది, నిధులు, అధికారాలతో స్థానిక స్వయంపాలనను అందించటంకన్నా.. గ్రామ/వార్డు సచివాలయాలు, గ్రామ వలంటీర్ల ద్వారా కేంద్రీకృత పాలన, సొంత ముద్ర, సొంత రాజకీయానికే ఆయన ప్రాధాన్యతనిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. చంద్రబాబు ప్రభుత్వ అవినీతి, తప్పిదాలు ఉంటే చట్టప్రకారం చర్యల మీద దృష్టి పెట్టకుండా.. పోలవరం, అమరావతి వంటి ప్రధాన అంశాలలో ప్రజలకు నష్టం కలిగించే తొందరపాటు వ్యవహారశైలిని ప్రదర్శించటం పట్ల జగన్ సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తి కనిపించింది. ముఖ్యమంత్రి రోజువారీ పాలనలోనూ ప్రజాస్వామిక రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన ఇలాంటి ఏకపక్ష, రాచరికపు ధోరణులు ఉన్నాయని.. మంచి లక్ష్యాలను చెబుతున్నారు గానీ అమలు విధానాల పట్ల ఓపికను, ఆసక్తిని మాత్రం చూపటంలేదని కొందరు మంత్రులు, ఉన్నతాధికారులే వాపోతున్నారు.

ప్రభుత్వాలు అనుచితంగా ఇచ్చే ఉచితాలు, ఇతర తాయిలాలతోపాటు అవసరమైన రంగాలలో పెట్టే ఖర్చు కూడా ఆ రకంగా సద్వినియోగం కాకుండా చాలామేర వృథా పోతోంది.

**తెలంగాణలోనూ రాజ్యాంగ లక్ష్యాలకు బహుదూరంగా**

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కూడా ప్రజాస్వామికీకరణకు, ప్రజల సాధికారతకు ఎంతో దూరంలో సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి ప్రధాన రంగాలలో చేస్తున్న ఖర్చు ప్రజల సాధికార స్వతంత్ర జీవనానికి దోహదం చేసేవిగా కాకుండా.. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలను నిరంతరం ప్రభుత్వం మీద ఆధారపడి చేయిజాచి అర్థించే ఓటుబ్యాంకులుగా కొనసాగించేలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు కారణమైన సాగునీటిని అందించే హామీ అమలులో.. రైతుల ఆదాయాన్ని పెంచటానికి, ప్రజాధనం సద్వినియోగమవటానికి ప్రాధాన్యం ఇవ్వకుండా– ఏమాత్రం హేతుబద్ధత, పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా అసంబద్ధ ప్రాజెక్టుల మీద పెద్దఎత్తున ప్రజల పన్నుల డబ్బును, వారి మీద తెచ్చిన అప్పుల్ని వెచ్చిస్తున్నారు. విద్యలో ఎక్కువమంది విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో ప్రమాణాలు అధ్వాన్నంగా




ఉన్నా, గురుకుల పాఠశాలల్ని దాటి ప్రభుత్వం ఆలోచించటం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన ఆరోగ్యశ్రీ, కొత్తగా కిట్‌లు, శిబిరాలే తప్ప.. ప్రాథమిక స్థాయి నుంచి ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి సమగ్ర ప్రణాళికను రూపొందించి నిధుల్ని సద్వినియోగం చేసే ప్రయత్నం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో, ఇతర స్థానిక ప్రభుత్వాల్లో చాలా మార్పులు గురించి ముఖ్యమంత్రి చెబుతున్నారుగానీ.. 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తికనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయింపులు చేసి స్థానిక పాలనను బలోపేతం చేసే ప్రయత్నం లేదు. గ్రామాలకు ఏటా రూ.5,000 కోట్లు ఇస్తామని చెప్పి మాటతప్పారు. రాజ్యాంగ లక్ష్యాల సాధనలో కీలకమైన చట్టబద్ధపాలన, స్థానిక స్వయంపాలన, అవినీతిరహిత పాలన, సత్వరన్యాయాలకు దోహదం చేసేలా ఎన్నికల హామీల్ని అమలు చేయటం లేదు. మరోవైపు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఉచితాలు, తాత్కాలిక తాయిలాలు మాత్రం యథాతథంగానే కొనసాగుతున్నాయి.

**జాతీయ స్థాయిలో తాత్కాలిక తాయిలాలు తక్కువేగానీ..**

జాతీయస్థాయిలో మోదీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల పాలకుల తరహాలో ఎడాపెడా తాత్కాలిక తాయిలాల్ని ప్రకటించకుండా కొంత నిబద్ధతతను పాటించిందనటంలో సందేహం లేదు. అయితే మోదీ కూడా ఆరోగ్యం వంటి మౌలిక రంగాలలో విధానాల రూపకల్పనను, అవినీతి, నల్లధనం నియంత్రణ హామీల అమలును రాజ్యాంగం ఆశించిన ప్రజల సాధికారత దిశగా కాకుండా.. యథాతథ స్థితిని కొనసాగించేలా, ప్రైవేటు శక్తులకు, తన పార్టీకి అనుచిత లబ్ధిని చేకూర్చేలానే రూపొందించారు. ఆయుష్మాన్‌భారత్ పేరుకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యబీమా పథకంగానీ, ఫలితాలు మాత్రం అత్యంత పేలవంగా ఉన్నాయి. ప్రపంచంలోనే అతి ఎక్కువమంది ప్రజల్ని ప్రభావితం చేసిన నిర్ణయాలలో ఒకటైన పెద్ద నోట్ల రద్దును కేవలం పార్టీ రాజకీయ ప్రయోజనం లక్ష్యంగా అమలు చేశారు తప్ప దేశ ప్రయోజనాలను పట్టించుకోలేదు. ఫలితంగా అవినీతి, నల్లధనం యథాతథంగా కొనసాగుతూ దేశ ఆర్థిక వ్యవస్థ కుంగింది. దేశంలో 80 – 90 శాతం మందికి ఉపాధిని కల్పిస్తున్న అసంఘటిత రంగం కుదేలై కోట్ల మంది జీవనభద్రత కల్లోలంగా మారింది. రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాకైనా తన తొలి హయాంలో చేసిన ఆ తప్పుల్ని దిద్దుకునేలా వ్యవహరించి, అసంఘటిత రంగంలో ఉపాధిని, ప్రజల సాధికారతను పెంచేందుకు.. భూ, కార్మిక, వ్యవసాయ సంస్కరణల్ని మోదీ ప్రభుత్వం అమలు చేయటం లేదు.

ఇలా మౌలిక రంగాల్లో వైఫల్యం, ప్రజలకు అధికారమిస్తే దొంగల్లా వ్యవహరిస్తారనే తృణీకారభావనలతో (ఈ భావనతోనే.. గతిలేక ఓ సర్టిఫికెట్ కోసం లంచం ఇచ్చిన పౌరులకు విధిగా కనీసం 3 ఏళ్లు కఠిన శిక్ష విధించాలని, లంచం తీసుకున్న అధికారిపై మాత్రం కేసు పెట్టటానికి కూడా ప్రభుత్వ ముందస్తు అనుమతి తీసుకోవాలని అవినీతి నిరోధక చట్ట సవరణను పార్లమెంటులో మోదీ సర్కారు తెచ్చింది) కేంద్రీకృత పాలన వల్ల.. మోదీ ప్రభుత్వం ఆచరణలో ప్రజాస్వామ్య రాజ్యాంగస్ఫూర్తికి వ్యతిరేకంగా పనిచేస్తోంది.

ఆర్టికల్ 370ను నిష్క్రియం చేయటం, 35ఎ ను తొలగించటం ప్రబల ఉదాహరణ

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాల అమలు రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా లేదనటానికి ఆర్టికల్ 370, 35ఎ ల అమలు రద్దు ప్రబలమైన ఉదాహరణ. 370, 35ఎ అధికరణాలు మధ్యంతరం, తాత్కాలికమైనవే, తొలగించవలసినవే గానీ.. వాటిని అమలు నుంచి

తొలగించినతీరు మాత్రం రాష్ట్ర ప్రజల మనోభావాలను గాయపరిచేరీతిలో, వారి ఆకాంక్షలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఉంది. పార్లమెంటరీ చర్చా సంప్రదాయాలను పరిహసించింది. అదే విధంగా మేనిఫెస్టోలో చెప్పిన ఆ అధికరణాలను తొలగించటానికి కొనసాగింపుగా, తొలగింపు తర్వాత ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవటానికి అవసరమన్నట్లు.. రాష్ట్ర విభజనను కూడా చేసేశారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాల స్థాయికి కుదించేశారు. ఒక్క కలం పోటుతో రాత్రికి రాత్రి భారతదేశ మ్యాప్‌లో నుంచి ఒక రాష్ట్రాన్ని తొలగించేశారు.

## ఫెడరలిజంపై దాడే

భారతదేశం ఫెడరలిజం పునాదిగా గల రాజ్యాంగంతో ఏర్పడిన రాష్ట్రాల సమాహారం. స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో అవసరమైన కేంద్రీకృత పాలన ప్రాధాన్యత క్రమంగా తగ్గుతుండటంతో రాష్ట్రాలు బలపడి ఫెడరలిజం కుదురుకుంది. ఇది ఇంకా విస్తృతమై స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాల్సిన మూడో అంచె ఫెడలిజం దశలో.. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఏకపక్షంగా జమ్మూ కాశ్మీర్ విషయంలో మోదీ ప్రభుత్వం వ్యవహరించింది. నిర్ణయంతో ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే రాష్ట్ర ప్రజలు, రాజకీయ పార్టీలు, సంఘాలతో సంబంధం లేకుండా పార్లమెంటు ఓ చట్టంతో రాష్ట్రాన్ని విభజించేసింది, స్థాయిని తగ్గిస్తూ కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చేసింది.

జమ్మూ కాశ్మీర్ విషయంలో మోదీ, అమిత్ షాల వ్యవహారశైలికి దేశవ్యాప్తంగా జయజయధ్వానాలు వినిపిస్తున్నాయి. కానీ కాశ్మీరీలతో సంబంధం లేకుండా కాశ్మీర్‌పై నిర్ణయాలకు మిగతా దేశంలోని, ప్రపంచంలోని అత్యధికులు చప్పట్లు కొట్టటం ఏం ప్రజాస్వామ్యం, ఏ రకమైన సాధికారత,




ఎటువంటి రాజ్యాంగబద్ధత?

కాశ్మీర్ ప్రత్యేక హోదా, ఆ రాష్ట్రంలో దీర్ఘకాలం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకఆర్థిక, రాజకీయ భారాన్ని దేశంలోని మిగతా రాష్ట్రాలు కూడా పెద్దఎత్తునే భరించాయనటంలో సందేహం లేదు. అయినా కూడా జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా.. ముందుగా అక్కడి ప్రజలతో సంప్రదింపులు జరపాలనటంలో మరో మాటకు తావు లేదు. ఆ రాష్ట్రానికి సంబంధించి మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ భౌగోళిక, అంతర్గత భద్రతకు, తాజాగా ఆఫ్గన్ పరిణామాల నేపథ్యంలో అవసరమే కావచ్చు. ఈ నిర్ణయానికి స్థానిక ప్రజలు, పౌర సమాజం, రాజకీయ పార్టీలు అంగీకరిస్తాయన్న నమ్మకం కేంద్ర సర్కారుకు ఉండుండకపోవచ్చు. అయినా కూడా ఆ ప్రయత్నమైతే చేయాల్సిందే. ఎవరితో సంప్రదించకుండానే నిర్ణయం తీసుకోవాల్సిన భయంకరమైన అత్యవసర పరిస్థితయితే ప్రస్తుతం కాశ్మీర్‌కు సంబంధించి, మిగిలిన దేశానికి సంబంధించి లేదని మాత్రం చెప్పవచ్చు. అంతకుముందు పీడీపీతో కలిసి ప్రభుత్వం నడిపినప్పుడు, ప్రస్తుత గవర్నర్ పాలనలో కూడా సంప్రదింపుల పరిష్కారం దిశగా చిత్తశుద్ధితో బీజేపీ నాయకత్వం ప్రయత్నించలేదు.

జమ్మూ కాశ్మీర్‌లోలా 356వ అధికరణపు నియంతృత్వాన్ని కొత్త ముసుగులో ఉపయోగించి, రాష్ట్రాల అధికారాల్ని లాగేసుకుంటుంటే.. సమాఖ్య వ్యవస్థే సంక్షోభానికి గురై అంతిమంగా ఎంతో వైవిధ్యభరితమైన భారతదేశ ఐక్యత, సమగ్రతలే ప్రమాదంలో పడే అవకాశాలున్నాయి.

## అంత త్వరగా గాయం మానదు

జమ్మూ కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతం నుంచి తిరిగి రాష్ట్రంగా మారుస్తామంటున్నారు. సంతోషం. కానీ తమ ప్రమేయం లేకుండా విభజన చేసిన తీరు వల్ల ఏర్పడిన గాయం మాత్రం కాశ్మీరీలు, భారత్‌లోని నిజమైన దేశభక్తులు, ప్రజాస్వామ్య ప్రేమికుల హృదయాల్లో నుంచి అంత తేలిగ్గా చెరిగిపోదు. ఆ చర్య పరిణామాలు కూడా దేశంపై దీర్ఘకాల దుష్ప్రభావం చూపే అవకాశముంది.

జమ్మూ కాశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వ చర్యలపై న్యాయపరంగా, అక్కడి ప్రజల నుంచీ పరిణామాలు, పర్యవసానాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే. 370 తరహాలో ప్రత్యేక ఏర్పాట్లున్న, ఏదోకరూపంలో ఇంకా అలాంటి అవసరమున్న ఇతర రాష్ట్రాల్లో కూడా సున్నిత పరిస్థితులు తలెత్తవచ్చు (ఏపీ ప్రత్యేక హోదా హామీ అమలును కూడా ఇక్కడ ప్రస్తావించాలి). మరోవైపు విభజనకు అవకాశాలు, కేంద్రపాలిత హోదాకు అనువైన నగరాలు ఉన్న రాష్ట్రాల్లోనూ సమీకరణలు మారవచ్చు.

కాశ్మీర్ మంటలు అలవిగానివైతే, దాన్ని మరపించేలా మరో సంచలన అంశాన్ని ఇప్పటికే బీజేపీ సిద్ధంగా పెట్టుకుని ఉన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు.

## సమాఖ్య వ్యవస్థపై దాడేనని అమిత్‌షా కూడా అంగీకరించారు

జమ్మూ కాశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వ చర్యలు ఫెడరలిజంపై దాడేనని జమ్మూ కాశ్మీర్ విభజన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన హోంమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాయే పరోక్షంగా అంగీకరించారు. కాశ్మీరీలతో సంబంధం లేకుండా ఆ రాష్ట్రాన్ని ఎలా విడగొడతారు? అని ప్రతిపక్ష నేతలు ప్రశ్నించగా.. అసెంబ్లీ తిరస్కరించినా, లోక్‌సభ తలుపులు మూసి, ప్రసారాలు తొలగించి ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లును మీరు ఆమోదించలేదా? అని కాంగ్రెస్‌ను ఆయన నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో పార్లమెంటులో తలుపులు మూసేసిన రోజు అసలైన చీకటి దినమని అభివర్ణించారు. "ఏపీ విభజన బిల్లును ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఉభయ సభలూ మూడింట రెండొంతుల ఆధిక్యంతో తిరస్కరించాయి. అయినప్పటికీ మీరు (కాంగ్రెస్‌వారు) ఏపీని విభజించారు. అలాంటప్పుడు చర్చ ఏం చేసినట్టు? ఆనాడు మీరు అలా చేసి మమ్మల్నెందుకు విమర్శిస్తున్నారు? అందరితో శాంతిపూర్వకంగా చర్చలు జరిపినట్లు చెప్పినవాళ్లు ఈ సభ తలుపులు మూసేసి, సభ్యులను మార్షల్ ద్వారా ఎత్తుకుపోయి బయటకు తోసేశారు. ఆరోజే చీకటి రోజు. విభజన చేయాలా? వద్దా? అనేదానిపై నేను మాట్లాడటం లేదు. కేవలం ఆనాడు జరిగిన ప్రక్రియ గురించే మాట్లాడుతున్నా" అని అమిత్‌షా అన్నారు. ఈ రకంగా.. కాంగ్రెస్ చేసిన తప్పుతో బీజేపీ చేసిన తప్పు చెల్లు అన్నారు తప్ప, తాము తప్పు చేయలేదని అమిత్‌షా చెప్పలేకపోయారు.

## తెలంగాణ ఉద్యమ సమయంలో విద్వేషాల్ని రెచ్చగొట్టినవారికీ ఇరకాటమైన పరిస్థితి

సాధారణంగా ఒక రాష్ట్ర విభజనలాంటి పరిణామాలపై ప్రశ్నలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దశాబ్దాల తర్వాతగానీ రాదు. కానీ రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులు వేగంగా జరుగుతున్న కాలం కావటం వల్ల.. ఏపీ విభజనపై కాంగ్రెస్, సంబంధిత ఇతరులు త్వరగా వైరుధ్యాల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇలా మాట్లాడటం వల్ల బీజేపీకే నష్టం, తెలంగాణలో గెలవటం కష్టం.. వంటి బెదిరింపులు, బుకాయింపులతో వైఫల్యాన్ని దాటవేయలేం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తెలంగాణలో నివసిస్తున్న ప్రజలు బలంగా కోరుకున్నారనటంలో సందేహం లేదు. దాన్ని వారు రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో పలుమార్లు వ్యక్తం చేశారు. వారి ఆకాంక్షకనుగుణంగా రాష్ట్రం ఏర్పాటు చేయటంలో ఎటువంటి తప్పూ లేదు. కానీ భావోద్రేకాలను రెచ్చగొట్టి ఆంధ్ర ప్రాంత ప్రజలను దోషులుగా చూపటం, తెలంగాణకు లాభం జరగాలంటే ఆంధ్ర ప్రాంతం నష్టపోవాల్సిందేనన్న అభిప్రాయంతో వ్యవహరించటాల్ని మాత్రం కచ్చితంగా ఖండించాల్సిందే.

## లోక్‌సత్తా వ్యవహరించిన తీరుని ప్రస్తావించాలి ఇక్కడ

విభజన అనేది సామరస్యంగా, ఎవరూ నష్టపోకుండా, అన్ని ప్రాంతాల మధ్యా సయోధ్యతో జరగాలి. సమైక్యాంధ్ర పేరుతో ఆంధ్ర ప్రాంతంలో ప్రజల్ని రెచ్చగొట్టినవారికీ – తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అవసరం, అనివార్యం అని చెబుతూ విభజన మాత్రం సామరస్య పరిష్కారంతో జరగాలన్న వారిని కూడా తెలంగాణ ద్రోహులుగా చిత్రీకరించినవారికీ మధ్య తేడా ఏమీ లేదు. ఇద్దరూ దివాళాకోరు ప్రజాస్వామ్య ధోరణులతో ప్రజాప్రయోజనాలను ఫణంగా పెట్టి సొంత లాభాల్ని, పదవుల్ని పొందటం కోసం ప్రయత్నించారు. వీరు చెప్పిందే నిజమని అనేకమంది అమాయక యువతీయువకులు, విద్యార్థులు భ్రమపడి గుడ్డిగా అనుసరించారు. అలాంటి అప్రజాస్వామిక తెలంగాణవాదులుంటే తెలంగాణకు వేరే శత్రువులక్కర్లేదు. సామరస్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పూర్తి అవకాశాలున్నా, దాన్ని ఉద్దేశపూర్వకంగా దాటవేశారు. ఈ నేపథ్యంలో, ఒక రాజకీయ పార్టీగా తెలంగాణ విషయంలో లోక్‌సత్తా వ్యవహరించిన తీరును ఇక్కడ ప్రస్తావించాలి.

తెలంగాణ భావోద్రేకాలకు లోక్‌సత్తా పార్టీలోని నేతలు కూడా లోనయ్యారు. కాకపోతే అజరామర లోక్‌సత్తా భావజాల బలం వారిని నియంత్రించింది. లోక్‌సత్తా భావజాలం గురించి అవగాహన ఉన్న తొలితరంవారిలోనైతే ఒక్కరంటే ఒక్కరు కూడా రాష్ట్రం ఏర్పాటుపై లోక్‌సత్తా వైఖరికి వ్యతిరేకంగా పెదవి విప్పలేదు. ఇతర పార్టీల్లో ప్రాంతాలవారీగా చీలిపోయి నేతలు పరస్పరం దూషణలు చేసుకుంటున్నా, ప్రాంతాలవారీ విద్వేషాలు అన్ని రంగాలనూ కుదిపేస్తున్నా.. లోక్‌సత్తా నేతల్లో దాదాపు అందరూ పరస్పర గౌరవభావంతోనే వ్యవహరించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంపై లోక్‌సత్తా వైఖరిని 1999 నుంచీ జేపీ వివరిస్తున్నా, సామరస్య పరిష్కారంలో భాగంగా 14 ఎఫ్ తొలగింపును కేంద్రాన్ని ఒప్పించి సాధిస్తున్నా.. 2009 నుంచి పెరిగిన ఉద్రేకపూరిత వాతావరణంలో కొన్ని అపోహలు పెరుగుతున్నాయి కాబట్టి– లోక్‌సత్తా వైఖరిపై స్పష్టతనిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. దీంతో లోక్‌సత్తా వైఖరిని ఒక తీర్మానంగా ఒకచోట పొందుపరిచారు. "సమగ్ర, సామరస్య పరిష్కారంలో భాగంగా ఏర్పడే తెలంగాణ రాష్ట్రాన్ని లోక్‌సత్తా పార్టీ స్వాగతిస్తుంది. కొత్త రాష్ట్రం ఏర్పడితే అద్భుతాలు జరుగుతాయని తెలంగాణవాదులు కల్పిస్తున్న ఆశలు, ప్రత్యేక రాష్ట్రంతో ఏదో ఉపద్రవం వస్తుందని

సమైక్యాంధ్రవాదులు చేస్తున్న వాదనలు మాత్రం భ్రమలే. ఒక రాష్ట్రం ఏర్పాటు సర్వరోగనివారిణి కాదు. అధికార వికేంద్రీకరణతోనే అసలైన స్వయంపాలన. విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయం, తదితర రంగాల్లో మౌలిక మార్పులతోనే, చట్టబద్ధ పాలనతోనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరేది. లోక్‌సత్తా వాదులు తాత్కాలిక అవసరాలు, భావోద్రేకాల్లో కొట్టుకొనిపోకుండా ప్రజల పక్షాన పరిష్కారంలో భాగమవ్వాలి".. తదితర అంశాలు ఆ తీర్మానంలో ఉన్నాయి. దీనిపై చర్చించి తుది నిర్ణయాన్ని ఖరారు చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల రాష్ట్ర నేతలను జేపీ కోరారు. రెండు ప్రాంతాలవారికీ లోక్‌సత్తా తీర్మానంలోని అంశాలు రుచించలేదు. కానీ పార్టీగా లోక్‌సత్తా వాదనను తోసిపుచ్చలేక ఆవేశాన్ని అణచుకుంటూ సమావేశాల్లో వాదనల్ని వినిపించారు. చివరకు.. తెలంగాణకు అనుకూలంగా చెప్పాల్సిందేనని తెలంగాణ నేతలు, సమైక్యాంధ్రే మేలని చెప్పాలని ఆంధ్ర, రాయలసీమ నేతలు అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. ఎవరి వాదన వారు వినిపించటం కాదు.. తెలంగాణ ప్రాంతం వారు, ఆంధ్ర ప్రాంతం వారితో కూర్చుని చర్చించండి అని జేపీ మళ్లీ సూచించారు. కొన్ని బృందాలుగా నేతల్ని విడగొట్టి, ప్రతి బృందంలో తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ వారు ఉండేలా చేశారు. కొన్ని గంటల చర్చ తర్వాత అందరూ చివరికి 'లోక్‌సత్తా ఇప్పటి వరకూ చెబుతున్న వైఖరే కరెక్టు, సమగ్ర, సామరస్య పరిష్కారంలో భాగంగానే తెలంగాణ ఏర్పడాలి' అని తీర్మానించారు.. లోక్‌సత్తా పార్టీ చేసిన పనినే తెలుగు రాష్ట్రాల్లోని పార్టీలు, జాతీయ పార్టీలు, భారత ప్రభుత్వం చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా చేశాయవి! కనీసం 'మన సమస్యకు మనమే పరిష్కారాలు రూపొందించుకుని, కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుదాం, తెలుగువారు ప్రాంతాలవారీగా కొట్టుకుంటే పిట్ట పోరు.. పిట్టపోరు పిల్లి తీర్చినట్లు కేంద్రం ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తుంది' అని జేపీ హెచ్చరించినా పలువురు రాజకీయ, పలు ప్రభుత్వోద్యోగ, ఇతరత్రా సంఘాల నాయకులు పట్టించుకోలేదు.

## ఆ పొరపాట్లు పునరావృతం కాకూడదు, ప్రజాస్వామిక పరిష్కారాల్ని సాధించే శక్తిని భవిష్యత్తులోనైనా సంతరించుకోవాలి

సామరస్యంగా విభజన జరగాలన్న వారిని తెలంగాణ ద్రోహులుగా చిత్రీకరించి విద్వేష వాతావరణం మధ్య తెలంగాణ విడిపోవాలన్న వారి వల్లే.. చైతన్యవంతులు, నిజాయతీపరులైన పలువురు తెలంగాణవాదులు జమ్మూ కాశ్మీర్ విభజనను సమగ్రంగా, సూటిగా ఖండించలేని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ఉద్యమ సమయంలోని భావోద్రేక రాజకీయం కంటే అనేక రెట్లు పెద్ద భావోద్రేక రాజకీయం ఇప్పుడు కాశ్మీర్ చుట్టూ రావటంతో స్పందించలేని వైఫల్యం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. దేశమంతా ఊగిపోతున్న ప్రస్తుత భావోద్రేకం వల్ల రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి జరుగుతున్న నష్టాన్ని తెలియజెప్పటానికి నైతిక శక్తిని కూడా తెలంగాణ ఉద్యమాన్ని అప్రజాస్వామిక మార్గంలోని నెట్టిన పక్షపాత మేధావులు, తొందరపాటు నేతలు కోల్పోయారు. సామరస్యంగా కాకుండా, విద్వేషపూరితంగా విభజన చేయటానికి ప్రయత్నించటం వల్ల ప్రజలకు లాభం జరగలేదుగానీ.. ఉద్రేకాల్ని, విద్వేషాల్ని రెచ్చగొట్టిన కొందరు రాజకీయ నాయకులు, సంఘాల నేతలకు మాత్రం లబ్ధి చేకూరింది.

తెలంగాణ ఏర్పాటుకు సహకరించి చిన్నమ్మగా ఆప్యాయంగా పిలిపించుకున్న స్వర్గీయ సుష్మా స్వరాజ్ కూడా పార్లమెంటులో అమిత్‌షా సమాధానానికి ఖిన్నురాలై ఉంటారు. సొంత పార్టీ నేతను కూడా తోసిపుచ్చి అమిత్‌షా, మోదీ ద్వయం పార్లమెంటులో కాంగ్రెస్‌ను ప్రశ్నించటం వెనక ఏపీలో బలపడటం వంటి రాజకీయ కారణాలు కూడా ఉండి ఉండవచ్చు. కానీ వారు లేవనెత్తిన ప్రశ్న మాత్రం చాలా విలువైనది, బలమైనది, ఎవరూ ఖండించలేనిది. తెలంగాణ ఏర్పాటులో గోల్ కొట్టింది తానేనని చెప్పుకున్న దివంగత జైపాల్ రెడ్డి కూడా వ్యవస్థీకృత సంప్రదాయం గురించి పట్టించుకోవాలన్న దూరదృష్టిని ప్రదర్శించలేకపోయారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో మోదీ, షా ఇలా వ్యవహరిస్తారనుకుంటే.. ఆయన కచ్చితంగా తెలంగాణ ఏర్పాటులో సమగ్ర, సామరస్య పరిష్కారానికి పట్టుబట్టేవారనటంలో సందేహం లేదు. తెలంగాణ విభజనను తిరగదోడటం, ఉద్యమకారులందరినీ విమర్శించటం ఇక్కడ ఉద్దేశం కాదు. అసెంబ్లీలో జేపీ ప్రకటించినట్లు, 'తెలంగాణ ఏర్పాటు అవసరం, అనివార్యం'! కనీసం భవిష్యత్తులోనైనా అప్రజాస్వామికంగా, విద్వేషపూరితంగా వ్యవహరించే తప్పిదాలు చేయకుండా.. ప్రజాస్వామిక విలువల్ని, చర్చల ద్వారా పరిష్కార సంస్కృతిని పెంపొందించుకుంటూ ఇందుకు దోహదం చేసే రాజ్యాంగబద్ధ వ్యవస్థల నిర్మాణానికి కృషి చేయాలన్నదే ఇక్కడ చెప్పదలచుకున్నది. తెలంగాణ ఆకాంక్షల్ని నెరవేర్చేది కూడా ఇలాంటి ఫెడరల్ రాజ్యాంగ ప్రజాస్వామిక సంస్కృతే!

## వైకాపా, తెరాస, తెదేపా మోదీ ప్రభుత్వానికి మద్దతివ్వటం దిగ్భ్రాంతికరం

ఆంధ్రప్రదేశ్ విభజన విషయంలో కేంద్రంలో అప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలో అధికారంలో ఉన్న యూపీయే ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందని, సమాఖ్య స్ఫూర్తిని కాలరాసిందని విమర్శించిన నూతన ఏపీలోని ప్రధాన పార్టీలు తెలుగుదేశం, వైకాపా, తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను కాశ్మీరీల ఆకాంక్షతో పోల్చటంతోపాటు తెలంగాణ

నూతన రాష్ట్రంలో అధికారంలోకొచ్చాక ఫెడరలిజం కోసం పోరాడుతున్నామని చెప్పుకుంటున్న తెరాస కూడా జమ్మూ కాశ్మీర్ ఏకపక్ష విభజనలో మోదీ ప్రభుత్వానికి మద్దతివ్వటం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది.

దేశ ఐక్యత పరిధిలో జమ్మూ కాశ్మీర్ సహా అన్ని రాష్ట్రాలకూ స్వయంప్రతిపత్తి ఇవ్వాలని కూడా అడగలేకపోయారు. కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని కాశ్మీర్‌లోనే కాదు, ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో కూడా ప్రజలు కోరుకోవటం లేదు. ఆ మాటకొస్తే, తమిళనాడు, అసోం, మిజోరం, నాగాలాండ్.. ఇలా అనేక రాష్ట్రాల్లో కూడా స్వయంప్రతిపత్తి ఆకాంక్ష బలంగా ఉంది.

రాష్ట్ర విభజన సమయంలో నూతన ఆంధ్రప్రదేశ్‌కు పార్లమెంటులో ప్రధానమంత్రి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ ఆర్థికాంశాలకే పరిమితమైనా.. ఏపీ ప్రజలు కేంద్రం పెత్తనం లేని స్వతంత్ర పాలననే కోరుకుంటున్నారు. గత ప్రధాని చట్టసభలో ఇచ్చిన హోదా హామీ చట్టంతో సమానమే అయినా.. ప్రస్తుత ప్రధాని మోదీ దాన్ని నిర్లక్ష్యం చేయటం, విభజన హామీల అమలుపై తెలుగు ప్రజలకు కనీసం వివరించేందుకు కూడా ఆసక్తి చూపకపోవటం వల్ల ఏపీలో కేంద్రం ఆధిపత్య ధోరణుల పట్ల వ్యతిరేకత మరీ ఎక్కువగా ఉంది.

భావోద్వేగాలను రెచ్చగొట్టేలా కాశ్మీర్ విషయంలో మోదీ వ్యవహరించిన తీరు చూశాక కూడా.. కేసీఆర్, జగన్, చంద్రబాబు వంటి వారి కన్నా మోదీ నిజాయతీపరుడు, మెరుగైన, బలమైన నాయకుడు అనుకుంటున్నారు తప్ప.. కేంద్ర ఆధిపత్యాన్ని మాత్రం సహించాలని తెలుగు ప్రజలు అనుకోవటం లేదు. ఏ పార్టీ అయినా రాష్ట్రంలోని పాలనే తమకు ముఖ్యమనుకుంటున్నారు. రాష్ట్రం స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని, బలంగా వ్యవహరించాలని కోరుకుంటున్నారు. అందుకే వారు ఓటును కూడా ఎక్కువగా రాష్ట్ర స్థాయి అంశాలను దృష్టిలో పెట్టుకునే వేస్తున్నారు. జాతీయ స్థాయి పార్టీలైనా ఈ ప్రజాషరతులకు లోబడితేనే రాష్ట్రాల్లో సొంత సామర్థ్యంతో, సుస్థిరంగా గెలవగలవు.

మరోవైపు పాలనలో కూడా రాష్ట్రాలపై కేంద్రం అనుచిత పెత్తనం వల్ల విద్య, ఆరోగ్యం వంటి మౌలిక రంగాల్లో కూడా పూర్తిస్థాయి మార్పును తేవటం రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా సాధ్యం కావటం లేదు. స్థానిక ప్రభుత్వాలైన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు ఏం చేయాలో, అక్కడ ఎన్నికలు ఎలా జరగాలో కూడా జాతీయస్థాయిలో రాజ్యాంగంలో పెట్టటంలో ఏమన్నా అర్థముందా? అంచేత కాశ్మీర్ తరహాలోనే దేశంలోని అనేక రాష్ట్రాల్లో స్వయంప్రతిపత్తి ఆకాంక్ష, పాలనావసరాలు ఉన్నాయని స్పష్టంగా గుర్తించాల్సి ఉంది. దీన్నే అవకాశంగా వినియోగించుకుని, దేశ సమగ్రత, ఐక్యత పరిధిలో అన్ని రాష్ట్రాలకూ స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తూ, అందులో 370 అమలు రద్దుతో స్వయంప్రతిపత్తిని కోల్పోయామన్న భావనలో ఉన్న కాశ్మీర్‌ను కూడా చేరుస్తూ.. ఒక సమగ్ర ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం దేశం ముందుకు తేవాల్సింది. ఇలాంటి ప్రతిపాదన తెస్తే, కాశ్మీరీలలో కూడా ఒక సానుకూలత వ్యక్తమై వారూ ముందుకొచ్చేవారు, దేశ ఐక్యత సంపూర్ణతకొచ్చేది, నూతన భారతదేశం నినాదాల్లో కాకుండా వాస్తవికంగా ఆవిష్కృతమయ్యేది. ఇంతకుముందే చెప్పుకున్నట్లు, ఈ పరిష్కారాన్ని లోక్‌సత్తా జేపీ అనేకసార్లు సూచించారు. రాష్ట్రాలకు సొంత రాజ్యాంగాలు, ఎన్నికల పద్ధతులు కూడా ఉండొచ్చన్నారు. అమెరికాలో పలు రాష్ట్రాల్లో వేర్వేరు రాజ్యాంగాలు, భిన్న పాలనా పద్ధతులు ఉన్నంత మాత్రాన అమెరికా ఐక్యతకేమన్నా భంగం వాటిల్లిందా?.. ఈ రకమైన ఆచరణ సాధ్యమైన, పురోగామి అయిన, ప్రజాప్రయోజనకరమైన పరిష్కారం గురించి కూడా




మాట్లాడకుండా.. గుడ్డిగా తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు పార్లమెంటులో మోదీ ప్రభుత్వ చర్యకి మద్దతిచ్చాయి. చైనాను, పాకిస్తాన్‌ను బెంబేలెత్తించే రీతిలో భారతదేశానికున్న ప్రజాస్వామ్యం అనే శక్తిని సృజనాత్మకంగా ఉపయోగించి కాశ్మీర్‌ను పరిష్కరించకుండా.. నియంతృత్వం, అణచివేత వంటి ఆ దేశాల ఆయుధాలతో కాశ్మీర్ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి ఆమ్ ఆద్మీ (ఆప్) వంటి పార్టీలు కూడా ఏమాత్రం ముందుచూపు లేకుండా సమర్థించాయి.

'ఒకే దేశం–ఒకే రాజ్యాంగం' అని మోదీ ఘనంగా ఎర్రకోట మీద చాటినా.. వాస్తవానికి ఎన్నికల మేనిఫెస్టో అమలుకి, రాజ్యాంగ లక్ష్యాలకు మధ్య తలెత్తిన సంఘర్షణకు కాశ్మీర్ ఓ పెద్ద ఉదాహరణ.

## రాజ్యాంగ వ్యతిరేక ఉచితాల్ని నియంత్రించమని పదేళ్ల క్రితమే లేఖలు రాసినా పట్టించుకోని ఈసీ

ఎన్నికల హామీలు, వాటి అమలు రాజ్యాంగ లక్ష్యాలకు, రాజ్యాంగ సంస్కృతికి విరుద్ధ దిశలో ఉండకుండా పకడ్బందీ చర్యలు మనకు ఎంతో అవసరమని 2019 ఎన్నికల కంటే చాలా ముందు నుంచే వరుస ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. ఎన్నికల్లో ఉచిత టీవీలు వంటి ఎరలు వేయకుండా నిరోధించాలని, ఎన్నికల్ని వేలం పాటలు కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని 2006లో తమిళనాడు ఎన్నికల సమయంలో, 2008, 2009లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఎన్నికలప్పుడు కేంద్ర ఎన్నికల సంఘానికి లోక్‌సత్తా తరపున జేపీ లేఖలు రాశారు.

“ప్రజల జీవనోపాధి, నిత్యావసరాలతో సంబంధంలేకుండా కేవలం వారిని మభ్యపెట్టి ఓట్లు దండుకునే లక్ష్యంతో చేసే ఎన్నికల హామీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆ హామీలు పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం. వాటిని అనుమతించటం ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. తెలుగుదేశం పార్టీ తన ముసాయిదా మేనిఫెస్టోలో ఇచ్చిన ఉచిత కలర్‌టీవీల హామీపై తక్షణం చర్య తీసుకోవాలి. 2006లో తమిళనాడులో డి.ఎం.కే ఈ హామీని ఇచ్చినప్పుడే ఎన్నికల సంఘం మౌనం వహించకుండా ఉంటే 2008 అసెంబ్లీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆ హామీని ఇచ్చేదికాదు. కాంగ్రెస్‌పై అప్పట్లో (మే 8, 2008న) లోక్‌సత్తా పార్టీ ఫిర్యాదుచేసినా ఎన్నికల సంఘం స్పందించలేదు. ఇప్పుడు టీడీపీ అదే ఎర వేసి ఓటర్లను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇప్పటికైనా ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించకపోతే ఇక ఎన్నికల్లో ఈ తరహాలో ఉచిత స్కూటర్, ఉచిత కారు, బంగారు నెక్లెస్, చివరికి ప్రభుత్వడబ్బుతో నెలనెలా ఇంటింటికీ మద్యం బాటిళ్లు వంటి హామీల్ని అన్ని సంప్రదాయ పార్టీలూ ఇచ్చి ప్రజల్ని మోసం చేసే ప్రయత్నం చేస్తాయి. ఇటువంటి అవినీతి, అనైతిక ఎత్తుగడలను అడ్డుకోకపోతే ఎన్నికలు చివరికి బహిరంగ వేలంలాగా మారిపోతాయి.




పేదరికంలో ఉన్నవారిని ఆదుకోవటానికి తక్షణ సహాయంగా రాయితీలు, ఊతాలు ఇవ్వొచ్చు. ఉదాహరణకు ఉపాధిలేక ఆకలిబాధతో ఉన్నవారికి సబ్సిడీ బియ్యాన్ని అందించవచ్చు. అలాగే ఇళ్లు లేనివారికి ఇళ్లు కట్టివ్వటం, ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న రైతులకు ఉచిత విద్యుత్ వంటివి కూడా ఇవ్వొచ్చు. వాటి వెనక చిత్తశుద్ధి ఎంతుంది, వాటికి కాలపరిమితి ఉందా అనేది వేరే విషయం. కనీసం వాటి మీద చర్చ చేయవచ్చు. కానీ ఉచిత కలర్‌టీవీలు హామీకి ప్రజాప్రయోజన ప్రాతిపదిక ఏకోశానా లేదు. అలాంటి హామీనిచ్చి, అలాంటి వాటికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చిస్తామని చెప్పటం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగం పట్ల పూర్తి విశ్వాసంతో, నిబద్ధతతో వ్యవహరిస్తామని ప్రమాణం చేసి, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రిజిస్టర్ అయిన రాజకీయపార్టీలు అలాంటి రాజ్యాంగవిరుద్ధ హామీలనిస్తే వాటి గుర్తింపును తక్షణం రద్దుచేయాలి” ” అని 2009లో ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ)కి రాసిన ఉత్తరంలో జేపీ పేర్కొన్నారు.

ప్రజలకు రాజ్యాంగసంబంధ అంశాల మీద వారికి నిర్ణయాధికారం ఉండదని, రాజ్యాంగసంస్థలే చొరవ తీసుకుని ప్రజల ప్రయోజనాల్ని కాపాడాలని జేపీ స్పష్టంచేశారు.

“ఒక రాష్ట్ర శాసనసభకు చట్టాలు చేసే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూలులోని రెండవ, మూడవ జాబితాలకు మాత్రమే పరిమితం. ప్రభుత్వం పెట్టే ఖర్చు కాని, చట్టసభ చేసే చట్టంకాని రాజ్యాంగాన్ని ఉల్లంఘించరాదు. రాష్ట్రాల బాధ్యతల పరిధిలోకి టీవీల పంపిణీ ఎట్టిపరిస్థితుల్లోనూ రాదు. కాబట్టి ఆ టీవీల్ని ఇస్తామన్న హామీ రాజ్యాంగ ఉల్లంఘనే. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 29 ఎ సెక్షన్ ప్రకారం ప్రతి పార్టీ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. ఒకవేళ పార్టీలు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే వాటిని నియంత్రించే బాధ్యత ఎన్నికల సంఘానిదే” అని జేపీ ఎన్నికల సంఘానికి వివరించారు. రాజ్యాంగ పరిమితులను లెక్కచేయకుండా తప్పుడు హామీ ఇస్తున్నప్పుడు రాజ్యాంగసంస్థలే తక్షణ చర్యలు తీసుకోవా లన్నారు. సాంకేతిక సాకులను చూపి చర్యలు తీసుకోకపోతే అసలు రాజ్యాంగసంస్థల ఏర్పాటు వల్ల ప్రయోజనమే దెబ్బతింటుందన్నారు. రాజ్యాంగబద్ధతను పరిరక్షించేందుకు అనేక సందర్భాలలో నిర్భయంగా వ్యవహరిస్తుండటం వల్లే సుప్రీంకోర్టు ప్రజల విశ్వాసాన్ని చూరగొందన్నారు.

## వెనిజులా: అనుచిత ఉచితాలకు ఓటు వేస్తే..

# చివరికి జీవనాధారమే లేకుండా పోయింది!

**ప్రజల పన్నుల డబ్బుతో తాత్కాలిక తాయిలాల్ని పందేరం చేయటం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని నియంత్రించే కఠిన చర్యలు లేకుండా అధికారులు, ఉద్యోగులకు జీతాలు, బోనస్‌లు ఠంచనుగా ఇవ్వటం, నేతలు అందినకాడికి దోచుకోవటమే భారతదేశంలో పరిపాలన, రాజకీయంగా తయారైందని.. ఇదే ధోరణి కొనసాగితే కొన్నాళ్లకు మనదేశం కూడా వెనిజులా తరహాలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆమధ్య హెచ్చరించారు. ఇప్పటికే దేశంలో అసాధారణ ఆర్థిక ఒడిదుడుకులు మొదలయ్యాయని, 1991 సమయంలో విదేశాలకు బంగారం కుదువ పెట్టిన రీతిలో ఇతర దేశాల ఏకపక్ష షరతులకు తలొగ్గి ఆర్థిక సాయాన్ని పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో.. వెనిజులా సంక్షోభం గురించి వివరిస్తూ తాడేపల్లి హనుమత్ ప్రసాద్ ఓ పత్రికకు రాసిన వ్యాసంలోని అంశాలు..**



వెనిజులా దేశం ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. అక్కడి కరెన్సీ విలువ ఒక్కసారిగా పడిపోయింది. ఆహార కొరత తాండవిస్తోంది. ద్రవ్యోల్బణం 720 శాతం పెరిగింది. ముద్రించిన కరెన్సీకి, నిత్యావసరాలకు పొంతన లేనందున సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో టమాటా రూ.30,000 లకు (భారత్ కరెన్సీలో), లీటరు పాలు రూ.48,000 లకు చేరడం ఆర్థిక పరాకాష్ఠను తెలియజేస్తున్నది.

పూర్వపు వెనిజులా రాజు (నియంత) హుగొ చవేజ్ కాలంలో మొదలైన ఈ సంక్షోభం నికొలస్ మదురో కాలంలోనూ కొనసాగుతున్నది. ఆకలి, రోగాలు, నేరాలు, చావులు, జనం వలస పోవడం వంటివి నిత్యకృత్యమైపోయాయి. సుమారు 30 లక్షలమంది అమెరికా, మెక్సికో, కొలంబియా, కోస్తారికా, బ్రెజిల్, చిలీ, అర్జెంటీనా దేశాలకు వలస వెళ్లారు. ఇంకా భారీ సంఖ్యలో వెళ్తున్నారు.

1920–70 మధ్య వెనిజులాలో చమురు నిక్షేపాలు కనుగొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద నిక్షేపాలవి. చమురు ధరలే ఏ దేశ ఆర్థిక ప్రగతినైనా నిర్ణయిస్తాయి. 1980–1990 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పడిపోయాయి. వెనిజులా రుణగ్రస్తమైంది. 1998లో అధికారంలోకి వచ్చిన హుగొ చవేజ్ సామాజిక సేవల విస్తరణ పేరుతో అన్నిటిలో ప్రభుత్వ పాత్రను జొప్పించారు. కానీ దేశమంతటా అవినీతి పెరిగింది. చమురు ఉత్పత్తి తగ్గడంతో రుణభారం పెరిగింది. రష్యా సాయం తగ్గడంతో సంక్షోభం తీవ్రమైంది. 1985–94లో బ్రెజి ల్‌లో వచ్చిన ఆర్థిక సంక్షోభం, జింబాబ్వేలో 2008–09లో అధిక ద్రవ్యోల్బణం, 90వ దశకంలో సోవియెట్ రష్యా విచ్ఛిన్నం కావటం కంటే అధికంగా వెనిజులాలో సంక్షోభం ఉంది.

2010–12 మధ్య చవేజ్ తెచ్చిన ఆర్థిక సంస్కరణలు సత్ఫలితాలను ఇవ్వలేదు. 2013లో ఆయన చనిపోయారు. ఆయన తరువాత మదురో అధికారం చేపట్టారు. అప్పటికే ద్రవ్యోల్బణం ఏడాదికి 50 శాతం పెరుగుతూ వచ్చింది. ప్రజల కొనుగోళ్లపై ప్రభుత్వం నిర్బంధం విధించింది. దీంతో జనంలో నిరసన ఉధృతమైంది. నిరసనోద్యమాన్ని ప్రభుత్వం అణచివేసే క్రమంలో పలువురు చనిపోయారు. ప్రతిపక్ష నాయకుడు జువాన్ గైడో, మదురో మధ్య అధికార పోరు మొదలైంది. ఎన్నికల్లో అక్రమాల ఆరోపణల మధ్య మదురో 2018లో మళ్లీ అధికారం దక్కించుకున్నారు. 2015లో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికైన తనే అసలైన అధ్యక్షుణ్ణి అని గైడో వాదిస్తున్నారు. ప్రజల మద్దతు కూడగడుతున్నారు. అమెరికాతో పాటు 50 దేశాలు గైడోను గుర్తించాయి. మదురోను కమ్యూనిస్టు చైనా, రష్యాలు సమర్థిస్తున్నాయి. వెనిజులాలోని చమురు చుట్టూ దేశాలు రాజకీయం

చేస్తున్నాయి. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసు కుంటే సహించబోమని అమెరికానుద్దేశించి రష్యా అంటోంది.

వెనిజులాలో ప్రజలు పచ్చి మాంసం, తినడానికి పనికిరాని మాంసం కూడా కొనుక్కుంటున్నారు. విద్యుత్తులేక మాంసం ప్రాసెసింగ్ యూనిట్లు మూతపడ్డాయి. ఆస్పత్రుల చుట్టూ వైద్య వ్యర్థాలు పేరుకుపోయాయి. తిండి కోసం లూటీలు, దాడులు, అల్లర్లు జరుగుతున్నాయి. ఒకప్పుడు వెయ్యి లక్షల కోట్లతో 10 అగ్ర దేశాల సరసన నిలిచిన వెనిజులా ఇపుడు అట్టడుగు 10 దేశాల జాబితాలో చేరింది. తలసరి ఆదాయం రూ.13,000 నుంచి రూ.1,000 కి పడిపోయింది. దక్షిణ అమెరికా ఖండంలో ఉన్న వెనిజులా ఆయిల్ నిక్షేపాలు తీసేందుకు వచ్చిన అనేక విదేశీ కంపెనీల నుంచి వాటి లాభాల్లో 50% వసూలు చేసేది. 70% మంది కోటీశ్వరులయ్యారు. కానీ 30 శాతం పేదరికంలోనే ఉన్నారు. పేద ప్రజలు తిరుగుబాటు చేశారు. చవేజ్ అధికారంలోకి వచ్చాక ప్రజలందరికీ సంక్షేమం పేరిట విద్యుత్తు, నీరు, ఆహారం, బట్టలు అన్నీ ఉచితంగా ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రభుత్వ వ్యాపారం పెరిగాక ప్రైవేటు వ్యాపారస్తులు తమ దుకాణాలు మూసుకునే పరిస్థితి ఏర్పడింది. అంతా ప్రభుత్వమే కావటంతో అలసత్వం, అవినీతి పెరిగి నల్లబజారు ఊపందుకుంది. ఒకప్పుడు వ్యవసాయం చేసే వెనిజులా ప్రజలు అన్నీ ఉచితంగా లభిస్తుంటే వ్యవసాయం మానేశారు. ఆహారోత్పత్తి తగ్గిపోయింది. ఆహారం దిగుమతి చేసుకోవడం మొదలయింది. చమురు సంస్థలన్నీ ప్రభుత్వ రంగంలోకి తీసుకోబడ్డాయి. అక్కడా పోటీతత్వం పోయి అవినీతి మొదలయింది. సాంకేతికాభివృద్ధి మీద దృష్టి సారించలేదు. అన్నీ ప్రభుత్వ ఉద్యోగాలే, అందరూ ప్రభుత్వోద్యోగులే. 2013లో చవేజ్ చనిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన మదురో కూడా చవేజ్ బాటే పట్టారు. 2014లో ఆయిల్ బ్యారల్ ధర 100 నుంచి 60 డాలర్లకు పడిపోయింది. మొత్తం ధనం అసంబద్ధ సంక్షేమానికి ఆవిరైపోయింది. 2016లో 30 డాలర్లకు బ్యారల్ చమురు ధర పడిపోయింది. దీంతో దేశం ఇంకా ఘోరంగా పతనమయింది. తప్పు పాలకులది, ప్రజలది కూడా. అభివృద్ధికి, అందరికీ ఎదిగే అవకాశాలకు విద్య, ఆరోగ్యం వంటి మౌలికాంశాలను ప్రభుత్వమే ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలి. కానీ వాటిలో నాణ్యతకు ప్రాధాన్యతనివ్వకుండా, మిగిలినవి కూడా అడిగినా, అడక్కున్నా, అవసరమున్నా, లేకున్నా అందరికీ వరాల్లా ఉచితంగా అందించేస్తే, సంక్షేమం పేరిట అలాంటి వారికే ప్రజలు మద్దతిస్తే, ఓటు వేస్తే.. చివరికి జీవనాధారమే లేకుండా పోయింది వెనిజులాలో.

ఆదాయమున్నా, లేకున్నా అప్పులు చేసి మరీ సంక్షేమం పేరుతో ప్రజల పన్నుల డబ్బును తాత్కాలిక తాయిలాలకు పందేరాలు చేస్తూ.. సంపద సృష్టిని, అందుకు మూలమైన నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని, మౌలిక వసతులను, అధికార వికేంద్రీకరణను, అవినీతి నియం త్రణను పట్టించుకోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు వెని జులా అనుభవం ఇంకా పెద్ద పాఠం.

ఇక, ఆర్థిక సంక్షోభం వెనిజులాలో మహిళలను వ్యభిచారం బాట పట్టించింది. మరోవైపు రాజకీయ పోరు ముమ్మరమైంది. ప్రతిపక్ష గైడో అనుచరులకు, మదురో మద్దతుదారులకు పార్లమెంటు వేదికగా వెనిజులా స్వాతంత్ర్య దినోత్సవం నాడు భీకరపోరు జరిగింది. తలలు పగిలి రక్తసిక్తమయ్యాయి. సోషలిజం పేరుతో సాగిన ఉచితాలు, తాత్కాలిక తాయిలాలు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. ఒళ్లను, పిల్లల్ని అమ్ముకునే స్థితికి ప్రజలు దిగజారారు. ప్రజల్ని సంపదసృష్టిలో భాగస్వాముల్ని చేయకుండా సోమరిపోతుల్ని చేస్తే జరిగే నష్టానికి వెనిజులా పెద్ద ఉదాహరణ. ప్రజల సంక్షేమం కోసం చవేజ్ క్యూబా వెళ్లి క్యాస్ట్రో సలహా కూడా తీసుకున్నారు. పరిశ్రమలను జాతీయకరణ చేశాక దేశీయ ఉత్పత్తి లేదు. మందులు, వస్త్రాలు, కార్లు అన్నీ దిగుమతి చేసుకోవడం మొద లైంది. 2004-14 మధ్య చమురు ధరలు పెరిగినపుడు వచ్చిన ఆదాయాన్ని రాబోయే రోజుల కోసం సంరక్షించేందుకు ఓ నిధిని ఏర్పరచలేదు సరికదా, ప్రజలకు సంక్షేమం పేరిట ఉచితాలతో వరాల జల్లు కురిపించారు చవేజ్. ఆయన తర్వాత వచ్చిన మదురో ఏ సమస్యపైనా దృష్టి పెట్టలేదు. 2012లో వెనిజులా పౌరుడి కనీస ఆదాయం 192 డాలర్లు, ఇప్పుడు 20 డాలర్లు. అక్కడి కరెన్సీ బొలివర్ మంచు ముక్కలా కరిగిపోతోంది.


కప్పు కాఫీ ధర 450 నుంచి 70,00,000 బొలివర్లకు పెరిగింది. ధరలు 1,55,000 శాతం పెరిగాయి. నెలలో ఒకసారి మాంసం కొనాలంటే నెల జీతంలో 3వ వంతు ఖర్చు పెట్టాల్సిందే. రోజుకు 10 సార్లు కరెంటు పోతుంది. దీనివల్ల శవాలను కూడా దహనం చేయ టం లేదు. అవి కుళ్లి కంపు కొడుతున్నాయి. రోగులకు ఆస్పత్రిలో మందులిచ్చే పరిస్థితి లేదు. ప్రతి నెలా 20 మంది పిల్లలు ఆకలితోనో, మందులిచ్చే పరిస్థితి లేకో మరణిస్తున్నారు. మంచినీరు లభ్యం కావ టం లేదు. అమెరికా భారత్‌పై 'వెనిజులా నుంచి చమురు కొనవద్ద'ని ఒత్తిడి తెచ్చింది. వెనిజులా భారత్‌కు 30% తక్కువ ధరకు చమురు విక్రయించేందుకు సిద్ధపడింది. గల్ఫ్ దేశాల కంటే వెనిజులాలో చమురును వెలికితీయడం 3 రెట్లు ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది కావటం కూడా ఆ దేశానికి ఆర్థికంగా వెసులుబాటు లేకుండా చేసింది. చైనా మాత్రం వెనిజులాలో చమురును వెలికితీసేందుకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. చైనా ఇంకా కమ్యూనిస్టు దేశమే అయినా.. ఆ దేశ ఉదారతగా దీన్ని అర్థం చేసుకోనక్కర్లేదు. చైనా లెక్కలు చైనాకుంటాయి. వెనిజులా వైభవం ఇప్పుడు సుదూర గతంగా మారిపోయింది. ఉత్పాదకత, కొత్తతరం ఆలోచనలు, దీర్ఘకాలిక దృష్టి లేకుండా భోగవాదం, వినియోగవాదంలో కూరుకుపోయిన వెనిజులాను ఉద్ధరించేందుకు నేడు ఎవరూ ముందుకు రావడం లేదు.

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇండియా.. తస్మాత్ జాగ్రత్త!**

# గాడి తప్పామని ఒప్పుకుంటూనే..

## తిప్పుకుంటామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్న ఆర్థిక సర్వే - 2019

ప్రపంచ దేశాలను కమ్ముకొస్తున్న ఆర్థికమాంద్యం, మోదీ సర్కారు తప్పిదాల వల్ల భారత్ కూడా ఏదోకస్థాయిలో ఆర్థిక ఒడిదుడుకులకు లోనవక తప్పదన్న హెచ్చరికలకు కేంద్ర ప్రభుత్వం స్పందించక తప్పని పరిస్థితులు వచ్చేశాయి. ప్రభుత్వ వ్యవహారశైలిలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. బడ్జెట్ సమయంలోనే ఆదాయ లెక్కల లొసుగు బయటపడినా దబాయించిన కేంద్ర ప్రభుత్వం.. ఎట్టకేలకు ఆ లోటును పూడ్చుకోవటానికి, ఆర్థిక సంక్షోభాన్ని గట్టెక్కటానికి రిజర్వుబ్యాంకు నుంచి భారీ మొత్తాన్ని గుంజుకుంది. మందగమనం మొదలైందని, ఖర్చు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పాలనా యంత్రాంగానికి రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక స్థితిగతులు, సంక్షోభం, పరిష్కారాలపై భారత ఆర్థిక సర్వే-2019 ఏం చెప్పిందో ఒకసారి స్థూలంగా తిరగేద్దాం..




దేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని అంగీకరిస్తూ, తిరిగి కుదురుకోనుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. అయిదేళ్లుగా కనిష్ఠ స్థాయికి దిగజారిన వృద్ధి రేటు మళ్లీ బంతి లాగా పైకి ఎగురుతుందని అభిప్రాయపడింది. గత ఏప్రిల్ నుంచి పరిస్థితి మారిందని, 7 శాతం వృద్ధి రేటు సాధించే అవకాశం ఉందని తెలిపింది. 2024-25 కల్లా భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఇప్పటితో పోలిస్తే రెట్టింపై 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవాలంటే 8 శాతం వృద్ధి రేటు అవసరమని సర్వే అభిప్రాయపడింది. ఆర్థిక వ్యవస్థ లక్ష్యసాధనలో ప్రైవేటు రంగం పాత్ర ఆవశ్యకతను నొక్కిచెప్పింది.

కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రహ్మణ్యన్ రూపొందించిన ఆర్థిక సర్వే 2019.. గడచిన అయిదేళ్లలో సాధించిన వృద్ధి గురించిన విశ్లేషణ, రాబోయే కాలంలో చేయాల్సిన పనులకు మార్గదర్శనాల సమాహారంగా సాగింది.

ప్రైవేటు రంగ పెట్టుబడులు, ఎగుమతులు, ఉపాధి కల్పన.. మోదీ సర్కారు ముందున్న ప్రధాన లక్ష్యాలుగా ఆర్థిక సర్వే అభివర్ణించింది. ప్రస్తుతం 2.7 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. వచ్చే ఏడాది బ్రిటన్‌ను వెనుకకు నెట్టి ఐదో స్థానంలోకి రావచ్చున్నది. డిమాండ్, వినియోగ సామర్థ్యం పెంపు, కార్మిక శక్తి మెరుగు, కొత్త టెక్నాలజీ రాక వంటి వాటిలో పెట్టుబడులే ప్రధానమని, అవి పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. అప్పుడే ఉద్యోగాలు పెరుగుతాయని స్పష్టం చేసింది. కార్మిక రంగంలో మరిన్ని సంస్కరణలు అవసరమని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) పైనా దృష్టి పెట్టాలని, ఉపాధి కల్పనకు ఇవి గణనీయంగా దోహదం చేస్తాయని పేర్కొంది.

దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతుల ఆదాయ వృద్ధికి చర్యలు చేపట్టాలని, గ్రామీణ వినియోగ సామర్థ్యం బలపడితే.. అన్ని రంగాల్లో కొనుగోళ్లు ఊపందుకుంటాయని సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గితే కూడా దేశీయ వినిమయ సామర్థ్యం పెరుగుతుందని చెప్పింది.

### ఆర్థిక సర్వే సారాంశం స్థూలంగా..

**కార్మిక చట్టాల సవరణతో ఉద్యోగాల సృష్టి:**

కార్మిక చట్టాలను సవరించడం, కొన్ని ఆంక్షలను ఎత్తివేయటం ద్వారా ఉద్యోగాల సృష్టిని పెంచవచ్చు. ఇటీవల రాజస్తాన్ అలాంటి మార్పులే చేపట్టింది. మన దేశంలో రానున్న దశాబ్ద కాలంపాటు పనిచేయగల వయసున్న జనాభా ఏటా దాదాపు 97 లక్షల చొప్పున పెరుగుతుంది. 2030ల్లో ఆ పెరుగుదల ఏటా 42 లక్షలుగా మారుతుంది. వారిలో 60 శాతం మందికి పని కల్పించాలంటే.. రానున్న పదేళ్ల పాటు ఏటా 55-60 లక్షల ఉద్యోగాలను సృష్టించాలి. 2007-14 మధ్య

రాష్ట్రాలు కార్మిక చట్టాలను పెద్దగా సంస్కరించలేదు. 2014లో రాజస్తాన్ సంస్కరణలు చేపట్టగా మరికొన్ని రాష్ట్రాలు అనుసరించాయి. కార్మిక చట్టాల విషయంలో పాత ధోరణితో వ్యవహరిస్తున్న రాష్ట్రాలు తగినన్ని ఉద్యోగాలు సృష్టించలేకపోతున్నాయి. సరిపడా మూలధనాన్నీ సమకూర్చుకోలేకపోతున్నాయి.

**వేతనాల్లో అసమానతల్ని తొలగించాలి:**

మనదేశంలో ప్రభావశీల వేతన వ్యవస్థ అవసరం. వేతనాల్లో అసమానతల్ని రూపుమాపుతూ, పేదరికాన్ని తగ్గించేలా ఆ వ్యవస్థను రూపొందించాలి. ప్రధానంగా దిగువస్థాయిల్లో సమ్మిళిత వృద్ధికి దోహదపడాలి. గత 70 ఏళ్లలో మన దేశంలో కనీస వేతన వ్యవస్థ విస్తరించి.. సంక్లిష్టంగా మారింది. నైపుణ్యంలేని (అన్ స్కిల్డ్) ఉద్యోగుల విషయంలోనే దాదాపు 429 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్, 1915 షెడ్యూల్డ్ ఉద్యోగ విభాగాలు ఉన్నాయి. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ముగ్గురు వేతన కార్మికుల్లో ఒకరు కనీస వేతన చట్టం పరిధిలోకి రావటం లేదు. కాబట్టి వేతన వ్యవస్థను సరళీకరించాలి. భౌగోళిక పరిస్థితుల ఆధారంగా అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ అనే నాలుగు విభాగాలవారీగా కనీస వేతనాలను నిర్ధారించాలి. కార్మికులంతా వాటి పరిధిలోకి రావాలి. అప్పుడే వారికి తగిన రక్షణ చేకూరుతుంది. సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది.

**ఉపాధి పనుల నిర్వచనం మారాలి:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక సమాచారంతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్షోభ పరిస్థితులను అంచనా వేసే సూచిని అభివృద్ధి చేయాలి. ఇందుకు ఉపాధి హామీ కార్మికుల పని డిమాండ్ డేటాను వినియోగించాలి. ఉపాధి హామీ పనులు చేసేవారి బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా చేసే చెల్లింపులను పెంచాలి. కార్మికుల నైపుణ్యాలూ పెంచాలి. ఈ పథకం కింద 'పనుల' నిర్వచన పరిధిని పెంచాలి. ప్రజలు పేదరికం నుంచి బయట పడేలా.. వివిధ ఆదాయ మార్గాలతో వారి జీవితాల్లో వైవిధ్యం తెచ్చే విషయమై దృష్టి సారించాలి.

**ఆహార రాయితీల నియంత్రణ తప్పదు:**

పేదలకు ఆహార భద్రత కొనసాగాలంటే ఆహార రాయితీలను నియంత్రించక తప్పదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆహార రాయితీలకు రూ.1,71,298 కోట్లు కేటాయించగా, 2019-20 తాత్కాలిక బడ్జెట్ నాటికి రూ.1,84,220 కోట్లకు పెరిగింది. రాయితీల హేతుబద్ధీకరణతో అందరికీ ఆహార భద్రత కల్పించవచ్చు. ఆహార ధాన్యాల సేకరణ ధరకు, పేదలకు అందించే ధరకు మధ్య వ్యత్యాసం పెరగడం వల్లే రాయితీబిల్లు పెరుగుతోంది. ఆహార భద్రత చట్టం కింద దేశంలోని 80 కోట్ల మంది పేదలకు రాయితీ అందుతోంది. 2013-14లో కిలో గోధుమల ధర రూ.19 ఉండగా, అది 2018-19 నాటికి రూ.24-35కు, బియ్యం ధర రూ.26.15 నుంచి 34.72కు పెరిగింది. కానీ గోధుమలను కిలో రూ.2, బియ్యం కిలో రూ.3 చొప్పునే ఇస్తున్నారు.

**పదవీ విరమణ**

**వయసు పెంచాలి:**

భారతీయుల సగటు జీవితకాలం పెరుగుతుండటంతో పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి పెరగడం అనివార్యంగా కనిపిస్తోంది. 2031-41 మధ్యకాలంలో దేశ జనాభా 0.5 శాతం పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా పదవీ విరమణ వయసును పెంచక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జర్మనీ, ఫ్రాన్స్ లాంటి దేశాల తరహాలోనే మన దేశంలోనూ సంతాన సాఫల్యత తగ్గి, జీవితకాలం పెరుగుతోంది. జనాభా ఇదే స్థాయిలో ఉండాలంటే ప్రతి మహిళ సగటున 2.1 మంది పిల్లల్ని కనాల్సి ఉండగా, 13 ప్రధాన రాష్ట్రాల్లో ఇది 1.6 – 1.7 మధ్యే ఉంటోంది. దీనివల్ల వృద్ధుల జనాభా రాబోయే దశాబ్దంలో

---

**మౌలిక వసతులపై వ్యయాన్ని 14 లక్షల కోట్లకు పెంచాలి**

ప్రభుత్వం నిర్దేశించుకున్నట్లు 2032 నాటికి 10 లక్షల కోట్ల డాలర్ల (సుమారు 700 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా మారాలంటే, మౌలిక వసతుల కల్పనపై ఏటా వెచ్చిస్తున్న మొత్తాన్ని రెట్టింపు చేసి 200 బిలియన్ డాలర్ల (సుమారు 14 లక్షల కోట్ల)కు పెంచాలని ఆర్థిక సర్వే సూచించింది. ప్రస్తుతం ఏడాదికి 100-110 బిలియన్ డాలర్ల (సుమారు 7-7.70 లక్షల కోట్లు) మొత్తాన్ని రోడ్లు, రైళ్లు, విమానాశ్రయాలు, జల రవాణా వంటి మౌలిక వసతుల కల్పనకు వెచ్చిస్తున్నారు. ఈ మొత్తాన్ని రెట్టింపు చేయాలంటే (జీడీపీలో 7-8 శాతం) ప్రభుత్వం ఒక్కటే వెచ్చించలేదు కనుక, ప్రైవేటు పెట్టుబడులను భారీగా ఆకర్షించాలని సూచించింది.
+ దేశంలో జాతీయ రహదారుల పొడవు 1.32 లక్షల కిలోమీటర్లు. ఇందులో 20 శాతం గత నాలుగేళ్లలోనే నిర్మించారు.

పెరుగుతుందని అంచనా. అందుకే పదవీవిరమణ వయసును పెంచాల్సి ఉండొచ్చు. 19 ఏళ్ల వయసులోపు ఉన్నవారి సంఖ్య ఇప్పటికే పడిపోతోంది. 2011లో ఇది 41 శాతం ఉండగా, 20141 నాటికి 25 శాతానికి తగ్గుతుందని భావిస్తున్నారు. పిల్లల సంఖ్య తగ్గటంతో పాఠశాలల అవసరం తగ్గి, వాటిని విలీనం చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. 60 ఏళ్లు దాటినవారి సంఖ్య 2011లో 8.6 శాతం ఉంటే, 2041 నాటికి అది 16 శాతానికి చేరుతుంది. 2041 నాటికి 20-59 ఏళ్ల మధ్య వయసుండేవారి జనాభా 59 శాతానికి చేరుకునేలా ఉంది. ఆస్పత్రులు ప్రస్తుతమున్న స్థాయిలోనే ఉంటే తలసరి పడకల అందుబాటు తగ్గుతుంది. కాబట్టి వాటి సంఖ్యను పెంచటంపై దృష్టి పెట్టాలి.

**వృద్ధుల సంక్షేమంపై శ్రద్ధ:**

వృద్ధుల సంక్షేమంపై శ్రద్ధ చూపాలి. అందుకోసం ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెంచాలి. తక్కువ జీతాలు, వేతనాల్లో తేడాలు, సమ్మిళిత అభివృద్ధి సాధనకు ఆటంకాలుగా మారుతున్నాయి. చట్టాలు, విధానాల్లో మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కార్మికశక్తిని సమర్థంగా వినియోగించడం ద్వారా ఇలాంటి అవరోధాలను అధిగమించే అవకాశం ఉంది.

**నీటికొరతను అధిగమిద్దాం:**

పలు ప్రాంతాల్లో వర్షాభావం వల్ల పంట దిగుబడులపై ప్రభావం ఉంటుంది. భూగర్భ జలాలు పడిపోతున్నాయి. నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రైతులను సాగునీటి సమర్థ వినియోగం దిశగా ప్రోత్సహించాలి. 2050 నాటికి మన దేశంలో నీటి కొరత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. 'భూముల నుంచి ఉత్పాదకత' ఆధారంగా కాకుండా 'సాగునీటి సమర్థ వినియోగంతో ఉత్పాదకత' దిశగా వ్యవసాయాన్ని మళ్లించే విషయమై దృష్టి సారించాలి. సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహించేందుకు రాయితీలు ఇవ్వాలి. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలతో భూసారం, సమర్థ నీటి వినియోగం పెరుగుతాయి. పాడి, పశుపోషణ, మత్స్యరంగాలకు విధానాల రూపకల్పనపై దృష్టి సారించాలి. 2018-19లో వ్యవసాయ రంగ వృద్ధి మందగించింది.

**పన్నుల చెల్లింపు, అప్పులు తీర్చడం పవిత్ర కర్తవ్యమని గుర్తించేలా చేయాలి:**

పన్నుల చెల్లింపు, అప్పులు తీర్చడం 'పవిత్ర కర్తవ్యం'.

## తెలుగు రాష్ట్రాల ప్రస్తావన

2015-16 నుంచి తెలుగు రాష్ట్రాల్లో లింగనిష్పత్తి పురోగమనంలో సాగింది. లింగనిష్పత్తి 980కి మించి ఉన్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చేరాయి. ఏపీలో 2001లో సంతాన సాఫల్య రేటు 2.3 శాతం ఉండగా, 2041 నాటికి అది 1.5 శాతానికి చేరనుంది. తెలంగాణలోనూ ఇది 2.3 శాతం నుంచి 1.6 శాతానికి చేరే అవకాశం ఉంది.

- తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన 25 రకాల డేటాను ప్రభుత్వ శాఖలతో అనుసంధానం చేయటం అగ్రదేశాల్లో మాదిరిగా బాగుంది. 2014 ఆగస్టులో నిర్వహించిన ఈ సర్వేలో ప్రతి వ్యక్తికి సంబంధించిన నేరాలు, ఆస్తులు, సబ్సిడీలు, యుటిలిటీలు, విద్య, పన్నులు వంటి సమాచారాన్ని క్రోడీకరించి ప్రభుత్వం ఒక చోటికి చేర్చింది. అదే వ్యక్తికి సంబంధించిన సమీప బంధువుల సమాచారంతో అనుసంధాన పరిచింది.
- ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లలో 40% ప్రాథమిక పాఠశాలల్లో 50 శాతం కంటే తక్కువమంది పిల్లలున్నారు.
- ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో భూఉత్పాదకత ఎక్కువ ఉన్నప్పటికీ సాగునీటి వినియోగ ఉత్పాదకత తక్కువగా ఉన్నది. సాగునీటిని సమర్థంగా వినియోగించుకోవటం లేదు.
- పెట్టుబడిలేని వ్యవసాయాన్ని ప్రోత్సహించటంలో ఏపీ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ ముందున్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో సేవలరంగం బలంగా లేకపోయినా గత కొన్నేళ్లలో ఆ రంగంలో మేలైన వృద్ధిని నమోదుచేసింది. 2013-17 కాలంలో ఈ రంగంలో ఏపీ 9.2%, తెలంగాణ 10.7% వృద్ధి నమోదు చేశాయి.
- 100 శాతం ఓడీఎఫ్‌కు చేరని నాలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఇక్కడ వ్యక్తిగత మరుగుదొడ్ల లభ్యత 73.99 శాతం మాత్రమే ఉంది.

భారతీయ సంస్కృతిలో మతానికి చాలా ప్రాధాన్యత ఉంది. పన్నులు, రుణాల చెల్లింపునకు ఈ భావనను జోడించాలి. అప్పులు తీర్చకపోతే పాపమని, పరలోకంలో శిక్షలు తప్పవని హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతాలు ఘోషిస్తున్నాయి. ఇలా సర్వమత సారాంశాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పటం ద్వారా ఆర్థిక వ్యవస్థకు నైతిక ప్రవర్తనను అనుసంధానించేలా చూడాలి. అప్పులు తీర్చడం, పన్నులు చెల్లించడం ఒక పవిత్ర కర్తవ్యంగా వారు భావించేలా చేయాలి. ప్రతి జిల్లాలో అత్యధికంగా పన్ను చెల్లించే 10 మందికి విశేషాధికారాలు కల్పించాలి. ఇమ్మిగ్రేషన్ కౌంటర్లలో దౌత్యవేత్తల తరహా ప్రయోజనాలు, విమానాశ్రయాలలో వేగంగా వెళ్లగలగటం, రోడ్లు, భవనాలు, పాఠశాలలకు వారి పేర్లు పెట్టటం వంటి ప్రోత్సాహకాలను అందించాలి. పన్నులు చెల్లిస్తే హోదా, గౌరవం దక్కుతాయన్న విషయం అందరికీ తెలుస్తుంది.

**ప్రైవేటు రంగానికీ 'డేటా'**

ఎంపిక చేసిన 'కొంత' డేటాను వాణిజ్య వాడకానికి ఇవ్వాలి. దీనికి రుసుము వసూలు చేయాలి. డిమాండును అంచనా వేసి, ఇప్పటివరకు ఎవరూ గుర్తించని మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విశ్లేషణ సంస్థలకు డేటాని అమ్మాలి. ప్రభుత్వం వద్ద ఉన్న డేటాతో ప్రైవేటు రంగం లబ్ధి పొందేందుకు అవకాశాలు ఉన్నాయి. డేటా గోప్యతకు పెద్దపీట వేస్తూనే పేదల ప్రయోజనం కోసం ప్రభుత్వం వద్ద అపారంగా ఉన్న డేటాని వినియోగించుకోవచ్చు. ప్రజల ఆరోగ్య రికార్డులతో 'జాతీయ ఆరోగ్య రిజిస్ట్రీ'ని ఏర్పాటు చేయాలి.

**స్మార్ట్ నగరాల్లో పనులు బాగున్నాయి:**

స్మార్ట్ నగరాల కార్యక్రమంలో 100 నగరాల్లో రూ.2.05 లక్షల కోట్ల ప్రాజెక్టులు ప్రతిపాదించగా, వాటి అమలు తీరు బాగుంది. సమీకృత కమాండ్, కంట్రోల్ కేంద్రాలు, స్మార్ట్ రహదారులు, స్మార్ట్ నీరు, ఇంటి పైకప్పుల మీద సౌరఫలకాల ఏర్పాటు విషయంలో పురోగతి బాగుంది.

**కోర్టుల పనిదినాలు పెరగాలి:**

సులభతర వాణిజ్య నిర్వహణకు కోర్టుకేసులు అవరోధంగా ఉన్నాయి. పెండింగ్ కేసులను తగ్గించాలంటే న్యాయస్థానాల పనిదినాలు పెంచడం, న్యాయమూర్తుల నియామకం అవసరం. పెండింగులో ఉన్న కేసుల్లో 87.5 శాతం దిగువ కోర్టుల్లోనివే. వీటిలో 2279 పోస్టులు, హైకోర్టులలో 93 పోస్టులు భర్తీ చేస్తే నూరుశాతం కేసులు పరిష్కారం అవుతాయి. సత్వర న్యాయంతోపాటు నాణ్యమైన న్యాయసేవలూ అందించాలి. ఇందుకోసం సమర్థ పాలన అవసరం. ప్రస్తుత చీఫ్ జ్యుడీషియల్ అధికారే పాలనా వ్యవహారాలను చూస్తున్నారు. ఇండియన్ కోర్టులు, ట్రిబ్యునల్ సర్వీసుల వ్యవస్థకు ఈ బాధ్యతను అప్పజెప్పాలి.

**స్వచ్ఛ భారత్‌తో ఆరోగ్యం మెరుగు:**

'స్వచ్ఛ భారత్'తో పలు రాష్ట్రాలు బహిరంగ మలవిసర్జనరహితం (ఓడీఎఫ్)గా ఆవిర్భవించాయి. ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడ్డాయి. పాఠశాలల్లో విద్యార్థినుల శాతాన్ని పెంచడంలోనూ ఈ కార్యక్రమం దోహదపడింది.

**బ్రాడ్‌గేజ్ మొత్తం విద్యుదీకరణ:**

2021 నాటికి రైల్వే బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్ 100% విద్యుదీకరణ లక్ష్యం. ఈ ఏడాది ఏప్రిల్ 1కి 35,448 కిలోమీటర్ల విద్యుదీకరణ పూర్తయింది. రైలు ప్రమాదాలు తగ్గాయి. 2018-19లో వస్తురవాణా అంతకుముందు సంవత్సరం కంటే 61.84 మిలియన్ టన్నులు ఎక్కువ. స్వచ్ఛ రైల్ స్వచ్ఛ భారత్ మిషన్ పరిశుభ్రతపై దృష్టి సారించింది.

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నా కూడా, దేశ ఆర్థిక వ్యవస్థ 2015-16 నాటికి 1.99 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.139.3 లక్షల కోట్లు) స్థాయి నుంచి 2018-19లో 2.75 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.192.5 లక్షల కోట్లు) స్థాయికి చేరిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వర్ధమాన మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల (ఈఎండీఈ) ఆర్థిక వ్యవస్థలు 2019లో 0.3 శాతం, 0.1 శాతం చొప్పున నెమ్మదిస్తాయనే అంచనాలున్నాయి. ఇదే సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం వృద్ధి చెందుతుందనే భావిస్తున్నారు. గత దశాబ్దకాలంలోపే ఈఎండీఈ జీడీపీలో భారతదేశం వాటా 1.3 శాతం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 0.7 శాతం పెరిగాయి. 2018లో ఈఎండీఈలో మన దేశ వాటా 8 శాతానికి చేరింది.
- ప్రపంచ వృద్ధి రేటుతో పాటు ఈఎండీఈ దేశాల వృద్ధి 2018లో నెమ్మదించేందుకు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు, చైనాలో కఠిన రుణ నిబంధనలు, అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక కఠిన నిబంధనలు కారణమని సర్వే తెలిపింది.
- వ్యవసాయం, వాణిజ్యం, రవాణా, సమాచారం, సేవల రంగాల్లో వృద్ధి నెమ్మదించడం వల్లే 2018-19లో జీడీపీ వృద్ధి రేటు 6.8 శాతానికి పరిమితమైనట్లు సర్వే తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉంటాయని ఆశిస్తున్నందున, వృద్ధి రేటు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ద్రవ్య లోటు జీడీపీలో 3.4 శాతంగా ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాధారణ ద్రవ్యలోటు 5.8 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది.
- గత ఆర్థిక సంవత్సరంలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐలు) పెట్టుబడులు నికరంగా రూ.38,931 కోట్లు వెనక్కు వెళ్లాయి. కానీ ఎఫ్‌పీఐల ఆస్తుల విలువ మాత్రం మార్చి 31, 2019 నాటికి రూ.33,42,680 కోట్లకు పెరిగింది.
- ప్రపంచ మార్కెట్లకు దేశీయ పరిశ్రమ చేరేందుకు 5 జీ

## వినూత్నం, అయినా..

ఈ ఆర్థిక సర్వే సాధారణంగా ప్రతి ఏడాది వెలువడే సర్వేలకన్నా భిన్నంగా ఉంది. కృష్ణమూర్తి సుబ్రహ్మణియన్ దీన్ని మూడు భాగాలుగా విభజించారు. బిహేవియరల్ ఎకనామిక్స్ ఆధారంగా ప్రభుత్వ పథకాలను విశ్లేషించిన తీరులో కొత్తదనం కనిపించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల గురించి సవివరంగా ప్రస్తావించారు. ఎంఎస్ఎంఈలే అధికంగా ఉపాధి కల్పిస్తాయనే భావన మనందరిలోనూ ఉంది. కానీ ఎంఎస్ఎంఈలకిచ్చే ప్రయోజనాలు దీర్ఘకాలికమైనవి కావడం వల్ల అనుకున్న స్థాయిలో ఉపాధి కల్పన జరగడం లేదని చెప్పారు. ప్రతి పథకానికి ఒక కాలపరిమితి నిర్దేశించాలని, ఉపాధి అవకాశాలు ఎక్కువగా అందుబాటులోకి తెచ్చిన పరిశ్రమలకు ఎక్కువగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. ఈ సూచనలు కొత్తగానే ఉన్నా (లోక్‌సత్తా జేపీ ఈ సూచనల్ని గతంలోనే చెప్పారు. సురాజ్య యాత్రలో పరిశ్రమలను సందర్శించినప్పుడు కూడా ఉపాధిని పెట్టుబడి రాయితీలతో లింకు చేయాలని జేపీ కోరారు. లోక్‌సత్తా టైమ్స్‌లో కూడా దీన్ని ప్రచురించాం. అవగాహన కోసం మాత్రమే ఈ వాస్తవాల్ని నరసింహమూర్తిగారి వ్యాసంలో ఇక్కడ తెలియజేస్తున్నామని పాఠకులు గమనించగలరు – ఎడిటోరియల్ టీం, లోక్‌సత్తా టైమ్స్) ప్రభుత్వం వాటిని ఏ మేరకు ఆమోదిస్తుంది, ఎంఎస్ఎంఈ సంఘాలు ఎలా వాటికి సానుకూలంగా స్పందిస్తాయి అన్నది వేచి చూడాల్సిన అంశం. ఇప్పటివరకు ఆర్థిక సర్వేల్లోని సూచనలు అధికశాతం అమలుకు నోచుకోవడం లేదనే చెప్పాలి. ప్రభుత్వం ప్రకటిస్తున్న ఆర్థిక సర్వేగానే ఇంతవరకు పార్లమెంటులో ప్రతిపాదించేవారు. కానీ ఈసారి ఆ సాంప్రదాయాన్ని పక్కనపెట్టి ప్రభుత్వ ఆర్థిక సలహాదారు ఇస్తున్న సర్వేగా ప్రకటించటం కొన్ని అనుమానాలకు తావిస్తోంది. దాన్ని నామమాత్రంగా మార్చి ఆర్థిక సర్వే అమలుకు ప్రభుత్వం దూరం అవుతున్నదా అనే సందేహం కలుగుతోంది.

కె. నరసింహమూర్తి, ఆర్థిక విశ్లేషకులు

సాంకేతికత చక్కని అవకాశమని ఆర్థిక సర్వే పేర్కొంది. డిజిటల్ చెల్లింపులు, మేథో సేవలతో కూడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించవచ్చుంది. 8,644 మెగాహెర్ట్జ్ 5 జీ స్పెక్ట్రంను రూ.4.9 లక్షల కోట్ల కనీస ధర ద్వారా ఈ ఏడాది వేలం నిర్వహించి, వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వ యోచన. ప్రభుత్వ సేవలు ఇంటి వద్దే లభిస్తాయని, వైద్య సలహాలు, భారీసంఖ్యలో లావాదేవీలతో వ్యయాలు తగ్గుతాయని, విద్య, వినోద రంగాల తీరూ మారుతుందని సర్వే వివరించింది.

- 2017–18లో సెన్సెక్స్ 17 శాతం ప్రతిఫలాన్ని పంచిందని ఆర్థిక సర్వే పేర్కొంది. స్టాక్‌మార్కెట్ జోరుతో మదుపర్ల సంపద రూ.8.83 లక్షల కోట్లు పెరిగింది. 2019–20లో సెన్సెక్స్ తొలిసారిగా 40,000 మైలురాయిని కూడా అందుకుంది.
- ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఉద్యోగాల సృష్టికి దోహదం చేసే అంకుర సంస్థలకు ప్రోత్సాహం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్థిక సర్వే సూచించింది. అంకురాలకు సంబంధించి పన్నుల విధానాన్ని హేతుబద్ధీకరించాలని తెలిపింది. 2019 మార్చి 1 నాటికి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కొత్త అంకురాల సంఖ్య 16,578. వీటిల్లో 47 శాతం అంకురాలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటయ్యాయి.
- భవిష్యతరం సుస్థిర రవాణాకు దోహదపడేలా విద్యుత్తు వాహనాలను (ఈవీ) తీర్చిదిద్దేందుకు, వాటిపై ఆర్థికభారం తగ్గే విధానాలు అవసరమని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఛార్జింగ్ వ్యవస్థలు లేకపోవడం వల్లే, దేశీయంగా ఈ వాహనాల కొనుగోళ్లు అతితక్కువగా ఉన్నాయని వివరించింది. వ్యక్తిగత కార్లలో 30 శాతం, వాణిజ్య కార్లలో 70 శాతం, బస్సుల్లో 40 శాతం, ద్వి చక్ర, త్రి చక్ర వాహనాల్లో 80 శాతం గనక విద్యుత్తుతో నడిచేలా 2030కి మారితే, 846 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను నివారించవచ్చని, 474 మిలియన్ టన్నుల ఇంధనం ఆదా చేయొచ్చని తెలిపింది.
- దేశీయ ఐటీ, ఐటీ ఆధారిత సేవారంగాలు సంప్రదాయకంగా సేవలందిస్తున్న దేశాల నుంచి సమస్యలు ఎదురవుతున్నందున, కొత్త విపణులకు విస్తరించే కృషి చేయాలని సర్వే సూచించింది. ప్రస్తుత అమెరికా, యు.కె. ఐరోపా సమాఖ్య మార్కెట్లను పటిష్ఠం చేసుకుంటూనే, ఆసియా, పసిఫిక్, లాటిన్ అమెరికా, మధ్య ప్రాచ్య దేశాల్లో పెరుగుతున్న అవకాశాలను ఉపయోగిం చుకోవాలి. దేశీయ ఐటీ–బీపీఓ పరిశ్రమ విలువ సుమారు 12.67 లక్షల కోట్లుకాగా, ఐటీ–

బీపీఓ ఎగుమతుల విలువ రూ.9.52 లక్షల కోట్లు.

- 28 ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటా ప్రక్రియను ఆర్థిక శాఖ వేగవంతం చేసినట్లు సర్వే వివరించింది. ఆ వాటా విక్రయం ద్వారా పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం రూ.85,000 కోట్లను సమీకరించింది.
- ఎగుమతులకు ఊతమిచ్చే నిమిత్తం అత్యున్నత స్థాయి సలహాదారుల కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఆర్థిక సర్వే సూచించింది. 2018-19లో భారత ఎగుమతులు 9 శాతం పెరిగి 331 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- గత ఆర్థిక సంవత్సరంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) తగ్గటం వల్ల బ్యాంకింగ్ రంగం మెరుగుపడింది. అయితే క్యాపిటల్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ తగ్గటం, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ)పై ఒత్తిడి వల్ల నిధుల ప్రవాహానికి ఆటంకాలున్నాయని సర్వే తెలిపింది. 2018 మార్చిలో ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 11.5 శాతం కాగా, 2018 డిసెంబరుకు 10.1 శాతానికి తగ్గాయి.
- దేశంలో ఉక్కు ఉత్పత్తి 2021 కల్లా 128.6 మిలియన్ టన్నులకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. వినియోగం కూడా 2023 నాటికి 140 మిలియన్ టన్నులకు పెరుగుతుందని భావిస్తోంది.



## లోక్‌సత్తా కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకున్న జైట్లీ

విద్యుత్‌రంగంలో ప్రధాన సమస్యలుగా ఉన్న అవినీతి, పంపిణీ నష్టాల్ని అరికట్టటం ఎలాగో లోక్‌సత్తా స్వయంగా చేసి చూపింది. 2004లో పశ్చిమ గోదావరి జిల్లా కల్లచెర్వు గ్రామంలో పైలట్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్తు పంపిణీ నష్టాల్ని 30 శాతం నుంచి 16శాతానికి లోక్‌సత్తా తగ్గించింది. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో అవినీతి లేకుండా రైతులకు వెంటనే సరఫరా జరిగేలా చేసింది. విద్యుత్ రంగంలో వికేంద్రీకరణ చేపడితే పంపిణీలో నష్టాలు తగ్గి భారీగా ప్రజాధనం ఆదాకావటంతోపాటు అవినీతి తగ్గుతుందని, ప్రతి గ్రామంలో ఇద్దరకు ఉద్యోగాలు కూడా వస్తాయని, వ్యవసాయ ఫీడర్లను వేరు చేస్తే గ్రామాలకు 24గంటలూ విద్యుత్తు అంది ఉపాధి పెరుగుతుందని లోక్‌సత్తా అప్పటి ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చింది. బీజేపీ అగ్రనేత అరుణ్‌జైట్లీ 2004లో స్వయంగా లోక్‌సత్తా కార్యాలయానికి వచ్చి ఈ వివరాలను తెలుసుకున్నారు (ఫోటోలో చూడవచ్చు). ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ అవే విద్యుత్ సంస్కరణల్ని అమలు చేయటం, ఆయన ప్రధాని కావటంలో ఆ విజయగాథలు కూడా కీలకపాత్ర పోషించటం తెలిసిందే. ఇటీవల అరుణ్‌జైట్లీ అకాల మరణానికి నివాళులర్పిస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ ఈ విషయాల్ని గుర్తుచేశారు. హుందాతనం, నిజాయతీ, సేవాభావం, వాదనాపటిమ గల జైట్లీ మరణం ప్రజాజీవితంలో పెద్ద లోటన్నారు. లోక్‌సత్తా చొరవతో మొదలైన రాజకీయ పార్టీల విరాళాల సంస్కరణకు, మంత్రివర్గ సంఖ్య కుదింపు, ఫిరాయింపుల నిరోధాన్ని బలోపేతం చేసిన 91వ రాజ్యాంగ సవరణకు జైట్లీ తోడ్పాటునందించారన్నారు.

# 'మేకిన్ ఇండియా' వ్యవసాయానికి వర్తించదా?

నరేంద్రమోదీ ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన 'మేకిన్ ఇండియా' (భారత్‌లో తయారీ) కొన్ని పరిశ్రమలకే తప్ప వ్యవసాయానికి వర్తించదా? అని లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు. రైతులు ఉత్పత్తి చేసిన పంటకు లాభసాటి ధర రాకుండా ప్రభుత్వాలే ఎందుకు అడ్డుపడుతున్నాయని నిలదీశారు. ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ 2019 పేరుతో విద్యాయాత్రను చిత్తూరు జిల్లా మదనపల్లె రిషీవ్యాలీ స్కూల్‌లో ప్రారంభించిన అనంతరం కడప జిల్లాలో కూడా జేపీ పర్యటించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రకృతి శాపం కన్నా పాలకుల పాపమే వ్యవసాయాన్ని, రైతులను నాశనం చేస్తోందని జేపీ అన్నారు. పాలకుల విధానాల వల్ల దేశంలో వ్యవసాయం దుర్భరంగా మారిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి లక్షల కోట్ల రూపాయల నష్టాన్ని రైతులకు కలిగిస్తూ.. పీఎం కిసాన్ సమ్మాన్ వంటి అరకొర సాయాల్ని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పంటలకు సంబంధించి ఏడాదికి రూ. 1,40,000 కోట్ల విలువైన ఎగుమతులు తగ్గుతుండగా, రూ. 70,000 కోట్ల విలువైన దిగుమతులు పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ గిడ్డంగుల్లో ఏటా 8 కోట్ల టన్నుల బియ్యం, గోధుమలు మూలుగుతుండగా ప్రజలు వాటినే సాగుచేయటానికి ఇష్టపడుతున్నారన్నారు. వంట నూనెలు, పప్పు ధాన్యాల దిగుమతికే ప్రభుత్వం మొగ్గు చూపుతోంది తప్ప.. మన దేశంలో రైతులను ప్రోత్సహించి స్వావలంబన సాధించే ప్రయత్నం చేయటం లేదన్నారు. వీటి దిగుమతి కోసం ఏటా రూ. 1,00,000 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. ఈ డబ్బును రైతులకే బోనస్‌గా ఇచ్చి ప్రోత్సహిస్తే కొద్దికాలంలోనే భారత్ వంట నూనెలు, పప్పు దినుసుల్లో ఎగుమతుల స్థాయికి ఎదుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శనగ రైతులకు క్వింటాలుకు రూ. 1500 ప్రోత్సాహక నగదు అందించటం మంచి చర్య అన్నారు. ఈ లబ్ధి గిడ్డంగుల్లో దళారులకు పోకుండా రైతులకు దక్కేలా చూడాలన్నారు. రాయలసీమలో వేరుసెనగ రైతులకు ప్రోత్సాహక నగదును అందించాలన్నారు. ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి సాగు చేస్తున్న రైతులకు పంటల ఆధారంగా ప్లెడ్జి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని జేపీ కోరారు. రుణమాఫీ, మరో తాయిలం అంటూ తప్ప.. పంటలకు ప్లెడ్జి లోన్లు ఇప్పించి రైతుకు గట్టి మేలు చేద్దామన్న తలంపు ప్రభుత్వాలకు లేకుండా పోయిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోను, దేశవ్యాప్తంగా కూడా ప్లెడ్జి రుణాల లెక్కలు తీస్తే పాలకుల బండారం బైటపడుతుందన్నారు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్నట్లు రైతుల పరిస్థితి తయారైందన్నారు.

రాష్ట్రంలో నిల్వ సదుపాయాలు, ప్లెడ్జి రుణాలు, ప్రాసెసింగ్ ఏర్పాట్లతోపాటు రిటైల్ చెయిన్లను పెద్దఎత్తున అందుబాటులోకి తేవాలని జేపీ అన్నారు. దీనివల్ల దళారులకు పోయే సొమ్ము రైతులకు దక్కుతుందని, వినియోగదారుడు చెల్లించే ప్రతి వందలో 70 రూపాయల దాకా రైతుకే దక్కుతుందని అన్నారు. వ్యవసాయంలో అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడితేనే మన రైతులకు లాభం లభిస్తుందని, ఇందుకు ప్రభుత్వాలే అవరోధాలు సృష్టిస్తున్న ప్రస్తుత విధానాలను మార్చాలని అన్నారు. రైతుల మేలుకు ఇప్పుడున్న పథకాలు సరిపోవన్నారు. పీఏసీ (పీపుల్ అగనెస్ట్ కరప్షన్) వ్యవస్థాపక అధ్యక్షుడు మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, టర్నింగ్ పాయింట్ అధినేత ఉత్తమ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు బసిరెడ్డి, దేవరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




"ప్రజలు తిడతారని
ప్రజలకు ఉపయోగపడే అభిప్రాయాలను
మార్చుకోకూడదు"

-మహాత్మాగాంధీ

# ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వైఎస్సార్ ఆకాంక్ష కూడా: జేపీ

ఎన్నికల్లో విపరీత డబ్బు ఖర్చు, పోటాపోటీ తాత్కాలిక తాయిలాల పథకాలు, శాసనసభకు పరిమితం కావాల్సిన ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో జోక్యం చేసుకోవటం, పార్టీలో అంతర్గత కుమ్ములాటల రాజకీయం వల్ల చట్టబద్ధపాలన, అభివృద్ధి, వ్యవస్థలు తరచూ దెబ్బతింటుంటూ అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెరిగిపోతాయని.. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికే ఈ సంక్షోభ పరిష్కారానికి ఆచరణలో మెరుగైన పరిష్కారమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ ప్రారంభసమయంలో ఈ ప్రతిపాదనను దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా చేశారని, లోక్‌సత్తా దీన్ని సాధిస్తే రాజకీయాల్లో పెద్దమార్పు వస్తుందన్నారని తెలిపారు. ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా నేరుగా ప్రజల నుంచి ముఖ్యమంత్రి ఎన్నికవటం వల్ల



అటు ఎమ్మెల్యే అభ్యర్థులు, ఇటు ముఖ్యమంత్రి అభ్యర్థులూ ఎన్నికల్లో డబ్బులు వెదజల్లే పరిస్థితులుండవన్నారు. ముఖ్యమంత్రి సమాజం నుంచి సమర్థులను మంత్రులుగా నియమించుకుంటారని, ఎమ్మెల్యేలు శాసనసభలో ముఖ్యమంత్రిని నియంత్రిస్తుంటారని, మొత్తంగా ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఇలాంటి రాజకీయంలో స్థానిక ప్రభుత్వాలకు ప్రాధాన్యత పెరిగి సామాన్య ప్రజల నుంచి బలమైన నాయకత్వం తయారవుతుందన్నారు. 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి' అంశంపై ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో డా॥ వైఎస్ రాజశేఖర రెడ్డి స్మారకోపన్యాసం చేస్తూ.. దేశ రాజకీయం, పాలనలో అనర్థాలకు మూలంగా మారిన ఎన్నికల వ్యవస్థలో మార్పునకు 2004లో వచ్చిన అవకాశం కొందరి మూర్ఖత్వం వల్ల చేజారిపోయిందని, దామాషా ఎన్నికల వ్యవస్థకు ఇప్పుడు అవకాశాలు తక్కువని జేపీ అన్నారు. అయితే ఇప్పుడు అధ్యక్ష తరహా ఎన్నికల గురించి జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీవారే మాట్లాడుతున్నారు కాబట్టి మరో అవకాశంగా దీన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికను సాధించుకోవటానికి ఇది మంచి అవకాశమన్నారు. సంక్షేమాన్ని, పార్టీ రాజకీయాల్ని, ఎన్నికల ఎత్తుగడల్ని ఎంతో సమర్థవంతంగా నిర్వహించటం వల్లే వైఎస్సార్ పదేళ్లు గడిచినా ప్రజల మనసుల్లో ఉన్నారని జేపీ అన్నారు. చేవెళ్ల-ప్రాణహిత వంటి అసంబద్ధ ఎత్తిపోతల పథకాలను, సహకార సంఘాలను ఆక్రమించాలన్న ప్రభుత్వ ప్రయత్నం వంటి వాటిని తాను తీవ్రంగా విమర్శించినా, అడ్డుకున్నా ఒక్క మాట కూడా ఆయన తూలలేదన్నారు. అయితే వ్యవస్థకున్న పరిమితులను ఛేదించలేకపోవటం వల్ల వైఎస్సార్ కూడా ఒక పరిధి దాటి విజయాలు సాధించలేకపోయారన్నారు. మౌలిక రంగాలైన విద్య, ఆరోగ్యాలను పట్టించుకుంటే ఓట్లు పడతాయని ఆయన గుర్తించినా.. ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్‌లను సక్రమంగా రూపొందించకపోవటం వల్ల ఆరోగ్యం, విద్యలో సంక్షోభం కొనసాగుతోందన్నారు. ఇంజినీరింగ్ చదివిన నిరుద్యోగులు పెరిగిపోయారన్నారు. వైఎస్సార్‌కున్న సంకెళ్లను ఛేదించి ఆయన కృషిని విస్తరించేందుకు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఎన్నికల సంస్కరణలకు.. ఆర్థికవృద్ధిని సాధించేందుకు మౌలిక వసతులు, భూ, ఉపాధి రంగ సంస్కరణలు, జిల్లాకు రెండు బ్రాండిక్స్ లాంటి సంస్థలు అన్ని రంగాల్లో ఏర్పాటు, చిన్న పట్టణాల అభివృద్ధికి.. నాణ్యమైన పౌర సేవల్ని అందించేలా పాలనా సంస్కరణలకు మనం ఇప్పుడు పనిచేయాలన్నారు. ఇదే ఆయనకు సరైన నివాళి అన్నారు. ప్రాంతీయ వెనుకబాటుతనానికి ప్రకృతి శాపం కన్నా పాలకుల పాపమే ప్రధాన కారణమన్నారు. ఉత్తరాంధ్ర విషయంలో ప్రకృతి కూడా అనుకూలంగా ఉందని, 1,165 మిల్లీమీటర్ల వర్షపాతం, సారవంతమైన భూములు, నీటి వసతి ఉందన్నారు. రాయలసీమకు కొంత వర్షపాతం తక్కువ ఉందన్నారు. పెద్ద వర్షపాతమే లేకుండా ఎడారి నేల కలిగిన ఇజ్రాయిల్ సాధించిన ప్రగతిని చూస్తే.. రాజకీయ సంకల్పం ఉంటే ఉత్తరాంధ్ర, రాయలసీమను ఏస్థాయిలో అభివృద్ధి చేయొచ్చో ఊహించుకోవచ్చన్నారు. కేంద్రం వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించాలని, అందులో ఉత్తరాంధ్ర, సీమలోని 7 జిల్లాలూ ఉండితీరాలని అన్నారు. విభజన సమయంలో ప్రధాని హామీ ఇచ్చినట్లు.. రూ.24,000 కోట్ల ప్యాకేజీని ఈ ఏడు జిల్లాలకు ఇవ్వాలని, ఆ డబ్బును స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతీయ మండళ్ల ఆధ్వర్యంలో ఖర్చు చేయాలన్నారు. జిల్లా బడ్జెట్‌లను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, అవినీతి జరిగితే చర్యలకు లోకాయుక్త ఆధ్వర్యంలో పనిచేసే స్వతంత్ర అంబుడ్స్‌మన్‌ను ప్రతి జిల్లాలో నెలకొల్పాలన్నారు. పోలవరం నిర్మాణం ఆపివేయటం మంచిదికాదన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలనిచ్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయాలన్నారు. గోదావరి వరద జలాల సద్వినియోగానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రయత్నించటం మంచిదేనని, అయితే వారు చెబుతున్న రీతిలో పథకం అమలు సరికాదన్నారు. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ, పులిచింతల.. అక్కడ్నుంచి నాగార్జునసాగర్‌కు తక్కువ ఖర్చుతో రివర్స్ పంపింగ్‌పై నిపుణులతో అధ్యయనం చేయించాలన్నారు. శ్రీశైలం నీటిని పూర్తిగా రాయలసీమ, తెలంగాణకే వదిలేయాలన్నారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పరిణతి చెందిన ప్రజాస్వామ్యం ఉంటే.. ప్రతి ఒక్కరూ

# జైపాల్‌రెడ్డి అవుతారు



పరిణతి చెందిన ప్రజాస్వామ్యం ఉంటే ప్రతి ఒక్కరూ జైపాల్ రెడ్డి అవుతారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో జరిగిన కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి సంస్మరణ సభకి పలువురు ప్రముఖులు పార్టీకలకతీతంగా హాజరై నివాళులర్పించారు. జేపీ మాట్లాడుతూ.. విలువలు, ఆలోచనతో కూడిన రాజకీయ నాయకుడు, కులం, మతం, భాష అనే తేడాలేని గొప్ప రాజకీయవేత్త, దేశం గర్వించదగ్గ సమున్నత వ్యక్తి జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. మరణం మనిషికే తప్ప మేధస్సుకు కాదని ఆయన నిరూపించారన్నారు. వెనుకబడిన దేవరకొండలో విద్యనభ్యసించి దేశం గర్వించదగ్గ నాయకుడిగా ఎదిగారన్నారు. అభివృద్ధి అంటే జీడీపీ పెరగటం కాదని, మంచి విద్యపై పెట్టే పెట్టుబడి దేశానికి ఎంతో విలువైన మానవ వనరులను అందిస్తుందన్నారు. 14-18 ఏళ్ల మధ్య వయసు పిల్లల్లో సగం మంది గడియారం చూసి టైమ్ చెప్పలేకపోతున్నారని, అలాంటి విద్యతో సమాజంలో ఎదుగుదల ఉండదన్నారు. ఓట్ల ద్వారా విశ్వాసం పొందడం కాదని.. ప్రజల జీవితాలను బాగు చేసి విశ్వసనీయతను పొందాలని అన్నారు. నాయకత్వం అలవడాలంటే విద్యతోపాటు చుట్టూ ఉన్న సమస్యలపై స్పందించే గుణం ఉండాలన్నారు. ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య మాట్లాడుతూ, స్వార్థం ఎరుగని అవినీతిరహిత ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్‌రెడ్డి అన్నారు. దేవరకొండ ప్రజలకు తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని, జైపాల్ లాంటి నాయకుడు ఈ ప్రాంతంలో చదువుకుని దేశ రాజకీయాల్లో ఎదిగారని అన్నారు. విద్యార్థులంతా ఆయన బాటలో నడవాలని, ఆయన చరిత్ర భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలని అన్నారు. వివాదాల జోలికిపోని విలువల నేత జైపాల్ రెడ్డి అని రాష్ట్ర మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పార్లమెంటులో అనర్గళ ఉపన్యాసాలతో పెద్దపెద్దవాళ్లు సైతం డిక్షనరీల్లో అర్థాలు వెతుక్కునేలా చేసిన గొప్ప ప్రతిభావంతమైన వక్త జైపాల్‌రెడ్డి అన్నారు. ఆయన రాజకీయం తీరును, వ్యక్తిత్వాన్ని నేటి తరం నేతలు అలవరచుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రిగా ఆ పదవులకే జైపాల్ రెడ్డి వన్నె తెచ్చారన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డి దేవరకొండలో విద్యనభ్యసించి దేశ రాజకీయాల స్థాయికి దేవరకొండ పేరును తీసుకొచ్చారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం దేశంలో ప్రజలకు అందాయంటే అందులో జైపాల్‌రెడ్డి పాత్ర ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. నాయకత్వం, మేధస్సుతో ఆయన దేశానికి సేవలందించారన్నారు. జైపాల్‌రెడ్డి చదువుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ నిర్మాణానికి తమ నిధుల నుంచి తలో రూ.25 లక్షలు కేటాయిస్తామని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహానికి ముఖ్యమంత్రిని కోరతామని ఈ సందర్భంగా నాయిని, గుత్తా ప్రకటించారు. పాఠశాలలో చుక్కా రామయ్య తదితరులు మొక్కలు నాటారు. జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రావణ్, లీల, నర్సింహ, ఉపాధ్యాయులు, విశ్రాంత ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, దేవరకొండ మాజీ సర్పంచి చిలువేరు కాశీనాథ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, పల్లా నర్సింహారెడ్డి, మన్మథరెడ్డి, కంబాలపల్లి ఆనంద్, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్, లీలా లక్ష్మారెడ్డి, వనం చంద్రమౌళి, బెజవాడ శేఖర్, నాయిని సుధీర్‌రెడ్డి, సముద్రాల ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# మీడియాలో 'కీ' కామెంట్లు!

*ఒక రాష్ట్రాన్ని అన్యాయంగా కేంద్రపాలిత ప్రాంతంగా మారిస్తే, అదేదో గర్వకారణమైన విషయంగా భావించే పరిస్థితి వచ్చింది. దేశంలో ఫెడరలిజానికి ఏర్పడుతున్న ముప్పును సమాజం చైతన్యవంతంగా తిప్పికొట్టాలి. ఎవరూ పట్టించుకోకపోతే రేపు మన గురించి మాట్లాడేవారే ఉండరు.*

**- కె.శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు**

ఆధునిక ప్రజాస్వామ్య దేశాలకు చట్టబద్ధ పాలన ఆత్మ వంటిది. ప్రజాస్వామ్యమంటే చట్టం ముందు సమానత్వం, రాజకీయ స్వాతంత్ర్యం, చట్టబద్ధ పాలనలే! ఓ వ్యక్తి తనకు నచ్చినట్లు చేసే పాలనకు, చట్టబద్ధ పాలనకు స్పష్టమైన వ్యత్యాసముంది.

- జస్టిస్ రంజన్ గొగొయి,
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

నినాదాలు చేయడం వేరు, విధానాలు రచించడం వేరు. విధానాలను సక్రమంగా రచించడం కోసమే సంవిధానం ఉంది. సంవిధానాన్ని కాదనుకుంటే, లేదనుకుంటే, ఉన్నా అది వేరు, పాలన వేరు అనుకుంటే వారికి ఏదీ చెప్పడం సాధ్యం కాదు. స్వేచ్ఛగా వ్యవహరించి, శాస్త్రీయంగా ఆలోచించి, సహేతుకంగా అభిప్రాయాన్ని ఏర్పరచుకుని, ధైర్యంగా చెప్పగలవాళ్లుంటేనే ప్రజాస్వామ్యం ఉంటుంది. మూఢంగా నమ్మటం మతంలో కుదురుతుందేమో కానీ సమాజంలో, రాజకీయంలో సాగించకూడదు. అభివృద్ధిని అవసరమైన వస్తువులాగా చూపి, టెర్రరిజం ప్రమాదాన్ని భయానక వాతావరణం కల్పించడానికి అనువుగా వాడుకుని, స్వతంత్రతను, స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, అధికార వికేంద్రీకరణను దెబ్బతీస్తూ ఉంటే మౌనంగా ఉండడం నేరమవుతుంది. మోదీ వల్ల ప్రజాస్వామ్యానికి వచ్చే ప్రమాదం కన్నా గుడ్డిగా ఆమోదించేవారి వల్ల ప్రమాదం ఎక్కువ. అయితే ఎవరేమన్నా, అనుకున్నా, తిట్టినా, లైక్ చేయకపోయినా నిజానిజాలను హేతుబద్ధంగా విశ్లేషించడం రాజ్యాంగవిధి, చట్టపరమైన బాధ్యత, నైతిక బాధ్యత, దేశభక్తుల బాధ్యత.

**మాడభూషి శ్రీధర్, బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్**

యావద్దేశం భవిష్యత్కాలాన్ని కలగంటూ వర్తమానంలో పడిపోయింది. రెండోదఫా ప్రధానిగా మోదీ వేస్తున్న అడుగుల్ని లెక్కేస్తూ, గమనిస్తూ, అంచనాలేయడంలో మునిగిపోయింది. ఇక్కడే ఓ భూతకాల అవసరాన్ని మరిచిపోయింది. గత లోక్‌సభ ఎన్నికల సమయాన్ని గతంలోకి నెట్టేసింది. ఆ ఎన్నికల సమయంలో జరిగిన అవాంఛనీయ పరిణామాలను మరిచిపోయింది. ఎన్నికల నిర్వహణలో జరిగినట్లు ప్రచారం జరిగి.. కొన్ని నిజాలున్నాయన్న భావన కలిగించిన ప్రతిపక్షాలే.. ఎన్నికలయ్యాక ఆ సంగతిని అటకెక్కించాయి. ఎన్నికల సంస్కరణలు తేవాలని అప్పట్లో తీవ్రస్థాయిలో చెలరేగిన గళాలు పార్లమెంటులో ఆ ప్రస్తావనే తేలేదు. లోక్‌సభ బడ్జెట్ సమావేశాల్లో పుంఖానుపుంఖాలుగా చట్టాలను సవరించారు. కానీ భారత ప్రజాస్వామిక వ్యవస్థకు అత్యంత కీలకమైన ఎన్నికల నిర్వహణలో తేవాల్సిన సంస్కరణల గురించి మాత్రం ఎవ్వరూ పెదవి విప్పలేదు. మళ్లీ అయిదేళ్ల తర్వాత ఎన్నికల సమయంలోనే వీరందరికీ ఎన్నికల సంస్కరణలు గుర్తుకొస్తాయి. అధికార పార్టీ మాత్రం జమిలి ఎన్నికలను గొప్పగా చూపించాలని ప్రయత్నిస్తోంది. రాజకీయాలు, ఎన్నికలు.. ప్రజాస్వామ్యంలో రెండూ పాశుపతాస్త్రాలే. రెంటికీ మధ్య అవినాభావ సంబంధం ఉంది. రాజకీయాలను అరాచకంగా చేస్తే ఎంత కీడు సంభవిస్తుందో.. ఎన్నికలను సజావుగా నిర్వహించకపోయినా అంతే అరాచకం జరుగుతుంది. ప్రజల ఓటు హక్కుకు భంగం కలుగుతుంది. ఓటర్ల నిష్పాక్షిక తీర్పుకి విఘాతం కలుగుతుంది. దరిమిలా రేపటి లక్ష్యం దారితప్పొచ్చు.

**వయస్సారెస్**

# ఉత్తుత్తి ప్రాంతీయ మండళ్లతో ఉపయోగమేంటి?..

# నిధులు, అధికారాలు ఇవ్వాలి: లోక్‌సత్తా

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎటువంటి నిర్ణయం తీసుకున్నా ప్రజలకు ఎటువంటి సమస్యా రాకుండా చూడవలసిన అవసరం ఉందని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. మంచి కార్యక్రమాలకు రూపమిస్తున్నానని ముఖ్యమంత్రి అనుకుంటున్న ప్రజాప్రయోజనాలకు సంబంధించి పలు కార్యక్రమాలు రద్దు కావటంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వైఎస్ఆర్ బీమా కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు పదివేల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని, అన్న క్యాంటీన్ల మూత, మినీ గోకులాల్లో చెల్లింపులు నిలిచిపోవటం, ఇసుక కొరత వంటివి ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయని అన్నారు. ఇసుకపై ప్రభుత్వం ముందుచూపు లేకుండా వ్యవహరించటంతో రోజువారీ కూలీలు రోడ్డున పడ్డారని, వ్యాపారాలు, నిర్మాణరంగం దెబ్బతిన్నాయని అన్నారు. 2018-19 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో 'మెటీరియల్ కాంపొనెంట్'పై విపరీత జాప్యం నెలకొందన్నారు. ప్రజలు అవస్థలు పడుతుంటే వరద చుట్టూ బురద రాజకీయం చేస్తున్నారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం అంశాల్లో, పాలనలో ప్రభుత్వం చంద్రబాబు మీద కక్షతో వ్యవహరిస్తోందిగానీ, ప్రజలకు నష్టం కలుగుతుందని ఆలోచించటం లేదన్నారు. రాజకీయ కక్షలతో రాజ్యమేలితే అనర్థాలు వస్తాయన్నారు. గ్రామ వాలంటీర్లుగా వైకాపా వారికే అవకాశమిచ్చారని, కనీసం గ్రామ సచివాలయ నియామకాలైనా నిష్పాక్షింగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నాలుగు ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేయటం మంచిదేనని, ఈ వికేంద్రీకరణను లోక్‌సత్తా ఎప్పటి నుంచో కోరుతోందని.. అయితే నామమాత్రపు మండళ్లతో ఉపయోగం ఉండదని, వాటికి నిధులు, అధికారాలు ఇవ్వాలని అన్నారు. భావజాలం రీత్యా లోక్‌సత్తా పార్టీ ఉనికి చారిత్రక అవసరమని, అందుకే సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నామని, స్థానిక ఎన్నికలు, 2024 ఎన్నికల్లో ఆసక్తి ఉన్నవారికి ప్రజాస్వామిక వేదికగా లోక్‌సత్తా వ్యవహరిస్తుందని బాబ్జీ తెలిపారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎంవీ రాజగోపాల్, డీఎండీ అబ్దుల్ రజాక్, చైతన్య, రాజారావు, ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు ముచ్చకర్ల సత్యనారాయణ, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేర చరితులు, కోటీశ్వరులు..

### ఏపీలో 50% పైగా ఓట్లతో గెలిచిన అత్యధిక ఎమ్మెల్యేలు వారే

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి ఎన్నికల్లో ఓటర్లు అత్యధికంగా నేరచరితులు, కోటీశ్వరులకే మద్దతు పలికినట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషణలో తేలింది. 175 మంది ఎమ్మెల్యేలలో 103 మందికి 50% పైగా ఓట్లు వచ్చాయి. వీరిలో 62% మంది నేరచరితులు. 60% కోటీశ్వరులు. 2014తో పోలిస్తే 2019లో గెలిచిన ఎమ్మెల్యేల సగటు ఓట్ల శాతం 0.67 శాతం పెరిగింది. ఈ సంస్థ విశ్లేషణ ప్రకారం ఎమ్మెల్యేలకు దక్కిన ఓట్ల శాతాలివి.

- 103 (59%) మంది ఎమ్మెల్యేలు 50 శాతానికిపైగా ఓట్లతో, 71 (41%) మంది ఎమ్మెల్యేలు 41% ఓట్లతో గెలుపొందారు.
- వైకాపా తరపున గెలుపొందిన 151 మందిలో 53 (36%) మంది 50% లోపు ఓట్లతో గెలుపొందారు. తెదేపా నుంచి గెలిచిన 23 మందిలో 17 (74%) మందికి, జనసేన తరపున గెలుపొందిన ఒక్కరికి 50 శాతం లోపు ఓట్లే వచ్చాయి.
- నేరచరితను వెల్లడించిన 96 మంది ఎమ్మెల్యేల్లో 60 (62%) మంది 50% పైగా ఓట్లు పొందారు.
- 163 మంది కోటీశ్వరుల్లో 98 మంది (60%) 50%కి పైగా ఓట్లు పొందారు.
- ఏడుగురు ఎమ్మెల్యేలు రెండు వేల లోపు ఆధిక్యంతో గెలుపొందగా, ముగ్గురు 50 %కి పైగా మెజారిటీతో ఘనవిజయం సాధించారు.
- వైకాపాలో 97 మందికి 50%కి పైగా, 54 మందికి 50% లోపు ఓట్లు వచ్చాయి. తెదేపాలో ఆరుగురికి 50% పైగా ఓట్లు వచ్చాయి.

### చెంచు గిరిజనులకు వైద్యసేవల్లో ప్రభుత్వం విఫలం..

# నేతల నిర్లక్ష్యం వల్లే వెలుగొండ జాప్యం



చెంచు గిరిజనులకు కనీస వైద్యాన్ని అందించటంలో ప్రభుత్వం విఫలమైందని జేపీ అన్నారు. పెద్దదోర్నాలలో చెంచు గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన వైద్యశాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇతర కార్యక్రమాలను అసంబద్ధంగా కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని, నల్లమల అటవీ ప్రాంతంలో గిరిజనులకు వైద్యసేవలు అందించటంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని, విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు లాంటి మౌలిక సమస్యలు పరిష్కరించకుండా అభివృద్ధి జరిగిందంటూ ఎంత చెప్పినా ఫలితం ఉండదన్నారు.


ప్రకాశం జిల్లా సురాజ్య యాత్రలో భాగంగా పెద్దదోర్నాల ప్రాంతంలో జేపీ పర్యటించారు. పాఠశాలలు, వైద్యశాలల్ని సందర్శించిన అనంతరం వెలుగొండ టన్నెల్‌ను పరిశీలించారు. సొరంగం నిర్మాణ పనులను ట్రాలీలో వెళ్లి పరిశీలించారు. అనంతరం సొరంగాలను తవ్వే యంత్రాల గురించి ఎన్ఎస్‌సీ డీజీఎం రామ్మోహనరావు, మరో అధికారి శివన్నారాయణలను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు 2018-19కి పూర్తయ్యే అవకాశాలు లేవని జేపీ ఈ సందర్భంగా అన్నారు. పశ్చిమ ప్రకాశం రైతుల ఆశాజ్యోతి అయిన వెలుగొండ ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్ల ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రాజెక్టులో తమకున్న భూములు కోల్పోయామని, తమకు నష్టపరిహారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారని కొత్తూరుకు చెందిన వెన్నా రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై స్పందిస్తూ.. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేపీ హామీ ఇచ్చారు. పాలకులకు సంకల్పం ఉండాలేగానీ, ఇవేవీ పెద్ద అంశాలు కాదన్నారు. చిత్తశుద్ధి, ప్రణాళికాబద్ధత లేకపోవడం వల్లే వెలుగొండ ఆలస్యమై రైతులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమాల్లో జన విజ్ఞాన వేదిక, ప్రజాసైన్స్ వేదిక, లోక్‌సత్తా, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా ఎజెండాయే మునిసిపల్ ఎన్నికల్లో మన బలం



స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసి పౌరులకు నిజమైన స్వయంపాలనను అందించే లోక్‌సత్తా ఎజెండాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగితే మునిసిపల్ ఎన్నికల్లో లోక్‌సత్తా ప్రభావాన్ని ఎవరూ అడ్డుకోలేరని పార్టీ సూర్యాపేట జిల్లా ఇంఛార్జి పల్లేటి రమేష్ అన్నారు. రానున్న మునిసిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. పట్టణంలోని లోక్‌సత్తా కార్యాలయంలో పార్టీ మునిసిపల్ ఎన్నికల ఎజెండాను ఆయన ఆవిష్కరించారు. పౌర సేవలను లోక్‌సత్తా ఒక హక్కుగా అందిస్తుందని, దందాలు, లంచాలు, వేధింపులు లేని పాలన లోక్‌సత్తాతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో నుంచి 50 శాతం నిధుల్ని మునిసిపాలిటీలకు కేటాయించేలా లోక్‌సత్తా పోరాటం చేస్తుందన్నారు. కులం, మతం, డబ్బుతో సంబంధం లేకుండా యువతకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు తొలి నుంచీ అవకాశం కల్పిస్తున్న లోక్‌సత్తా.. రానున్న ఎన్నికల్లో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తుందన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు మహేశ్వరి, ప్రసాద్, వీరప్రతాప్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణాలు, నగరాల్లో పెరుగుతున్న దుర్భర
పరిస్థితులను.. నాణ్యమైన పౌర సేవలను
అందించటంలో ఎదురవుతున్న సంస్థాగత
అవరోధాలను అధ్యయనం చేసే 'ప్రజ'
(పీఆర్ఏజేఏ) పురపాలన ప్రాజెక్టులో భాగంగా
ఇటీవల హైదరాబాద్ మేయర్ బొంతు
రామ్మోహనరావుని కలిసిన ప్రజాస్వామ్య
పీఠం (ఎఫ్‌డీఆర్) బృందం.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th September, 2019 Posting Date 15 &16th of every month

# ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పు రావాలి



దేశంలో అవినీతి అన్ని రంగాలలో వేళ్లూనుకుని పోయిందని.. అవినీతి సొమ్ము ఎన్నికలను, రాజకీయాలను భ్రష్టుపట్టిస్తోందని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అన్నారు. ఈ ప్రమాదకర పరిస్థితులను ప్రజలకు వివరించి చైతన్యపరచటంలో మీడియా దారుణంగా విఫలమైందన్నారు. మీడియా ఎందుకో తన బాధ్యత మరిచిపోయిందనే భావన కలుగుతోందన్నారు. ఇంత పెద్ద దేశంలో ఏం జరుగుతోందో ప్రజలకు తెలియాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడమంటే పెట్టుబడులు పెట్టి తిరిగి సంపాదించటమనే పరిస్థితి పోవాలంటే ఎన్నికల విధానంలో సమూల మార్పులు రావాలన్నారు. అవినీతి నిర్మూలన ఉద్యమంలో రాజకీయ పార్టీలు కలిసిరావాలన్నారు. తల్లి ఒడి నుంచే పిల్లలకు నైతిక విలువలను బోధించాలని కోరారు. అవినీతికి వ్యతిరేకంగా 'అవే' (అవాయడ్ వైల్డ్‌నెస్ అండ్ ఈస్టీనెస్) సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏ రంగంలోనైనా ఒక వ్యక్తి గురించి చెబుతున్నప్పుడు నిజాయతీపరుడు అనే విశ్లేషణ చెప్పుకోవాల్సి రావటం సిగ్గుచేటన్నారు. మన ప్రజల్లో ఎక్కువ శాతం అవినీతిపరులు కాదని, కానీ వారు అవినీతికి వ్యతిరేకంగా బలంగా పోరాడే వ్యవస్థను మనం నిర్మించలేకపోయామన్నారు. వ్యక్తిగత అవినీతి గురించి మాత్రమే మాట్లాడే ధోరణులు పోయి అవినీతిని నియంత్రించే వ్యవస్థల ఏర్పాటు మీద మనం దృష్టిని కేంద్రీకరించాలన్నారు. మంచిని ప్రోత్సహించి, చెడును నిరుత్సాహపరిచేలా, శిక్షించేలా మన విధానాలు ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం నుంచి స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు, ఎన్నికల వ్యవస్థలో సంస్కరణ దాకా ఆచరణ సాధ్యమైన అనేక చర్యలు మనకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఏపీ ప్రభుత్వ మాజీ సలహాదారు డా॥ పరకాల ప్రభాకర్, మాజీ ఐఆర్ఎస్ అధికారిణి ప్రీతి హరిత్, జేబీ రాజు తదితరులు ప్రసంగించారు. 'అవే' వ్యవస్థాపక అధ్యక్షుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి రచించిన 'అవినీతి-అదుపు ఏదీ' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఎం.వివేకానందరెడ్డి, సుజిత్‌సింగ్ కుంగర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మచ్చలేని ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారులు బి.రమేష్, ఆకునూరి మురళి, ఎస్.రాధాకృష్ణ, కందుల ఆనందరావు, కె.లక్ష్మీబాయి, సి.ఓబులమ్మ, ఇందిరమ్మ, డా॥ దాసరి సుబ్రమణ్యం, పోలీస్ కానిస్టేబుల్ జె.చంద్రయ్యలను ఈ సందర్భంగా సత్కరించారు.

**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020